RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 08 అక్టోంబర్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:112

# రాహుల్, ప్రియాంక అరెస్ట్

## నేలపై పడుకొని ప్రియాంక నిరసన..

**నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు.. వాటిని మెడల్స్ గా భావిస్తా: రాహుల్ గాంధీ**

**తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్పందించిన రాహుల్ గాంధీ**

**తనపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని వెల్లడి**

**'ఇండియా' కూటమి ఎంపీలతో ఖర్గే భోజన సమావేశం**

**ఈసీపై పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం**

**భేటీ అనంతరం జంతర్ మంతర్‌లో నిరసనకు విపక్షాలు సిద్ధం**











నిన్న ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేని పునరుద్ఘాటించారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, 'ఓట్ల దొంగతనం' అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ.. 'ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు' అని చమత్కరించారు.కాగా, మంవారం 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, "నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100" అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసులు జంతర్ మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లే మార్గాల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి చేపట్టిన నిరసన మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జంతర్ మంతర్ వైపు వెళ్తున్న ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అడ్డుకోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.

దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి చేపట్టిన నిరసన మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జంతర్ మంతర్ వైపు వెళ్తున్న ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అడ్డుకోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ప్రియాంక సహా పలువురు మహిళా నేతలు, కార్యకర్తలో నేలపై పడుకొని నిరసన తెలిపారుఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను రద్దు చేయాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్లతో బుధవారం జంతర్ మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చింది. మల్లికార్జున్ ఖర్గే ఆధ్వర్యంలో సాగర్ రత్నలో లంచ్ సమావేశం అనంతరం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ప్రతిపక్ష ఎంపీలు జంతర్ మంతర్ వైపు బయలుదేరారు. జంతర్ మంతర్‌కు సుమారు 100 మీటర్ల ముందు ప్రతిపక్ష ఎంపీలు ప్రయాణిస్తున్న బస్సులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎంపీలు బస్సుల నుంచి బయటకు వచ్చి నిరసనకు దిగారు

కొంతమంది కాంగ్రెస్ ఎంపీలు బస్సుల పైకి ఎక్కి నినాదాలు చేశారు (INDIA bloc protest). ప్రియాంక గాంధీ కూడా రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేయడంతో నిరసన ప్రదేశం వద్ద ఉద్రిక్తత నెలకొంది. నిరసన కొనసాగుతున్న సమయంలో పోలీసులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ రెండు రోజుల్లో రాహుల్ గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇది మూడోసారి.

## పోరాటం ఆగదన్న రేవంత్ రెడ్డి..

**తనను అడ్డుకున్న ఢిల్లీ పోలీసులపై అసహనం**



ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర విపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

బుధవారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీని నిర్బంధించిన అనంతరం, ఆయనను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, వారిని పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు.

ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ వర్గాల ఓటు హక్కును లక్ష్యంగా చేసుకుని వివక్షా పూరితంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. "గతంలో ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందిన వారు, ఇప్పుడు ఏకంగా ఎన్నికల కమిషన్‌నే పావుగా వాడుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు.



అక్రమ అరెస్టులు, పోలీసుల నిర్బంధాలకు విపక్షాలు భయపడవని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

# ప్రజాబలం

## 08 అక్టోబర్ 2026 గురువారం


## అమెరికా నిజంగానే దివాళా తీస్తుందా?

మొదటి నుంచీ ఎలాన్ మస్క్‌కి ఒక ప్రత్యేకత ఉంది. ఇతరులు భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నప్పుడు.. తాను ఆ భవిష్యత్తును తయారు చేయాలని ప్రయత్నిస్తుంటారు. ఎలక్ట్రిక్ కార్ల నుంచి అంతరిక్ష ప్రయాణం వరకు ఆయన చేసిన ప్రయోగాలు అందుకు ఉదాహరణ. అందుకే అమెరికా ఆర్థిక భవిష్యత్తుపై ఆయన చేసిన హెచ్చరికను కూడా మార్కెట్లు, టెక్ ప్రపంచం, పెట్టుబడిదారులు ఆసక్తిగా గమనిస్తున్నాయి. " అమెరికా దివాళా తీసే అవకాసం ఉంది" అని చెప్పినప్పుడు అది సాధారణ కామెంట్‌గా మిగలలేదు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వర్గాల్లో చర్చ మొదలైంది.మస్క్ చెప్పింది నిజంగా అమెరికా రేపే దివాళా తీస్తుందన్న హెచ్చరికేనా? లేక భారీగా పెరుగుతున్న అప్పులు, వడ్డీ భారం, బడ్జెట్ లోటు గురించి ఆయన చెబుతున్న అసలు సమస్యను మనం మరో కోణంలో చూడాలనా? అమెరికా జాతీయ రుణం గురించి మాట్లాడినప్పుడు మస్క్ ఈ తీవ్రమైన హెచ్చరిక చేశారు. ఏఐ రోబోటిక్స్ సాంకేతికతలు గనుక లేకపోతే అమెరికా ఆర్థికంగా తీవ్ర చిక్కుల్లో పడుతుందని, అప్పుల ఊబి నుంచి గట్టెక్కడానికి ఇవి తప్ప మరో మార్గం లేదని ఆయన స్పష్టం చేశారు.అయితే మస్క్ మాటల అంతరార్థం "అమెరికా దగ్గర రూపాయి (డాలర్) కూడా లేకుండా పోయింది" అని కాదు; పెరుగుతున్న అప్పుల వేగాన్ని దేశ ఆర్థిక వృద్ధి దాటలేకపోతే అసలు సమస్య మొదలవుతుందనేదే ఆయన ఆందోళన. అమెరికా ఇప్పటికే అప్పులపై చెల్లిస్తున్న వడ్డీ ఖర్చు రికార్డు స్థాయికి చేరడమే ఈ భయానికి ప్రధాన కారణం.అమెరికా జాతీయ రుణం ఇప్పటికే 40 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న ఆర్థిక విధానాలు దీర్ఘకాలంలో స్థిరంగా కొనసాగలేవని, రుణం-జీడీపీ నిష్పత్తి భవిష్యత్తులో మరింత ప్రమాదకరంగా మారుతుందని అమెరికా ట్రెజరీ స్వయంగా అంగీకరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందిఇక్కడ అసలు సమస్య అప్పు చేయడం మాత్రమే కాదు, దానిపై చెల్లిస్తున్న వడ్డీ భారం ఏటికేటా కొండలా పెరిగిపోవడం. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం కేవలం అప్పులపై వడ్డీ చెల్లించడానికే ఏడాదికి సుమారు 1 ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. అంటే ప్రభుత్వం సేకరించే ప్రతి ఐదు డాలర్ల ఆదాయంలో దాదాపు ఒక డాలర్ కేవలం వడ్డీలకే సరిపోతోంది. "అప్పు చేసి పప్పు కూడు తిన్నంత కాలం బాగానే ఉన్నా, అసలు కంటే వడ్డీయే ఎక్కువైనప్పుడు" అసలు కథ మొదలవుతుంది. అమెరికా విషయంలో సరిగ్గా ఇదే జరుగుతుండటంతో ఆర్థిక నిపుణులు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆమోదయోగ్యమైన 'రిజర్వ్ కరెన్సీ' అయిన డాలర్‌ను ముద్రించే అధికారం అమెరికాకు ఉంది. కాబట్టి దేశం పూర్తిగా దివాళా తీసి, మూతపడిపోతుందనే కోణంలో మస్క్ వ్యాఖ్యలను చూడలేం. కానీ, పెరుగుతున్న అప్పుల వల్ల వడ్డీ భారం పెరిగి, దానికోసం మరింత అప్పు చేయాల్సి రావడం, దానివల్ల మార్కెట్‌లో వడ్డీ రేట్లు మరింత పెరిగిపోవడం లాంటి 'డెట్ స్పైరల్' ఏర్పడే ప్రమాదం ఖచ్చితంగా ఉంది. దిగ్గజ ఆర్థికవేత్త రే డాలియో, జేపీ మోర్గాన్ సీఈఓ జేమీ డైమన్ వంటి వారు కూడా ఇదే రుణ విషవలయం గురించి అమెరికాను హెచ్చరించడం గమనార్హం.అప్పుల సుడిగుండం నుంచి బయటపడటానికి ఏ దేశానికైనా రెండే మార్గాలుంటాయి: ఒకటి ఖర్చులు తగ్గించుకోవడం, రెండు ఆర్థిక వ్యవస్థను వేగంగా పెంచడం. మస్క్ రెండవ మార్గాన్ని ఎంచుకున్నారు. రోబోటిక్స్ రంగాల వల్ల మానవ ఉత్పాదకత పదింతలు పెరిగితే, వస్తువులు, సేవల ఉత్పత్తి విపరీతంగా పెరుగుతుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ పరిమాణం పెరిగి, ప్రభుత్వానికి పన్నుల రూపంలో భారీ ఆదాయం వస్తుంది.ఫలితంగా అప్పు-జీడీపీ నిష్పత్తి తగ్గుతుందని మస్క్ భావిస్తున్నారు. ఆయన ఆలోచనలో రోబోట్ అనేది కేవలం ఒక యంత్రం కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు తీగెత్తించే గ్రోత్ ఇంజిన్. అయితే, అంత త్వరగా అంతటి ఉత్పాదకతను సాధించగలదా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి.అమెరికాలో పెద్ద ఆర్థిక సంక్షోభం తలెత్తితే అది వారి సొంత సమస్య మాత్రమే కాదని, గ్లోబల్ ఎకానమీలో భాగంగా భారత్‌పై కూడా దాని ప్రభావం ఖచ్చితంగా ఉంటుందని మనం గ్రహించాలి. అమెరికా బాండ్ యీల్డ్స్ పెరిగితే విదేశీ పెట్టుబడిదారులు భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి తమ డబ్బును ఉపసంహరించుకుని అమెరికా ఆస్తుల్లో పెట్టుబడి పెడతారు. దీనివల్ల భారత స్టాక్ మార్కెట్లలో హెచ్చుతగ్గులు రావడమే కాకుండా రూపాయి విలువ పడిపోయే అవకాశం ఉంది.డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడితే మన దిగుమతుల ఖర్చు భారీగా పెరుగుతుంది. ముఖ్యంగా భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగి, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు రవాణా ఖర్చులు ప్రియమవుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరిగి హైదరాబాద్‌లో ఉండే ఒక సామాన్య కుటుంబం నెలవారీ బడ్జెట్‌పై నేరుగా ప్రభావం పడుతుంది. భారతీయ ఐటీ రంగానికి ఇది రెండు రకాల పరిణామాలను తెచ్చిపెట్టవచ్చు. ఒకవైపు అమెరికా కంపెనీలు ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రాజెక్టులను కుదిస్తే ఐటీ అవుట్‌సోర్సింగ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. మరోవైపు, తమ ఖర్చులను వేగంగా తగ్గించుకోవడానికి వారు ఆశ్రయిస్తే, మన ఐటీ కంపెనీలకు సరికొత్త అవకాశాలు తలుపు తడతాయిమొత్తానికి, మస్క్ చెప్పినట్లుగా అమెరికా వెంటనే దివాళా తీయకపోవచ్చు కానీ, పెరుగుతున్న అప్పులు మరియు వడ్డీ భారం నిజంగానే ఆ దేశానికి పెద్ద తలనొప్పిగా మారాయి. మస్క్ హెచ్చరికలో కొంత అతిశయోక్తి ఉన్నప్పటికీ, అమెరికా అప్పుల సమస్యను ప్రపంచం ఇక ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయలేదనేది పచ్చి నిజం.అందుకే ఇప్పుడు ఆలోచించాల్సింది "అమెరికా దివాళా తీస్తుందా,లేదా?" అని కానే కాదు, పెరుగుతున్న అప్పుల భారం కంటే వేగంగా, అమెరికా తన ఆర్థిక వ్యవస్థను పరుగులు తీగెత్తించగలదా లేదా అనేదే! దీనికి కాలమే సమాధానం చెప్పాలి.

## ప్రజాసేవలో ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రస్థానం - గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు



హైదరాబాద్, అక్టోబర్ 7, 2026: ప్రజాసేవలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రస్థానం పూర్తిచేసుకున్న సందర్భంగా తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ మేరకు తన అధికారిక సామాజిక మధ్యమాల్లో శుభాకాంక్షలు తెలుపుతూ బుధవారం పోస్ట్ చేశారు.

2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ నరేంద్ర మోదీ, గుజరాత్ ముఖ్యమంత్రి నుంచి దేశ ప్రధానిగా ఎదిగి 25 ఏళ్లుగా ప్రజాసేవలో కొనసాగుతున్నారని గవర్నర్ పేర్కొన్నారు.

ప్రజాసేవ పట్ల ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ చూపుతున్న నిబద్ధత, సంకల్పం ప్రశంసనీయమని గవర్నర్ అన్నారు. దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషిని అభినందించారు.

ప్రజాసేవలో 25 ఏళ్ల ప్రస్థానం ఒక కీలక మైలురాయి అని పేర్కొన్న గవర్నర్, ప్రధాని శ్రీ నరేంద్ర మోదీకి సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని, దేశ ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, సామర్థ్యం భగవంతుడు ప్రసాదించాలని గవర్నర్ ఆకాంక్షించారు.

## ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం

### పెట్టుబడులను ఆకర్షించేందుకు సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి.

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



హైదరాబాద్, అక్టోబర్ 7: రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు.

తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని సీఎస్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, TGIIC వీణ శశాంక, ITE&C సంయుక్త కార్యదర్శి అనుదీప్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ, ఎండీ, అజిత్ రెడ్డి, నిఖిల్ చక్రవర్తి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ బలం.. యువత నైపుణ్యమే

## ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం: మంత్రి శ్రీధర్‌బాబు




హైదరాబాద్, అక్టోబర్ 7: తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు.

జూబ్లీహిల్స్‌లో బుధవారం నాడు జరిగిన డిఇ షా షా (DE Shaw) ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.

ఈ సందర్భంగా డిఇ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్ ప్రసాద్, నీల్ కాట్జ్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు.

హైదరాబాద్ సామర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డిఇ షా ఒకటని శ్రీధర్‌బాబు అన్నారు. 1996లో హైదరాబాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.

"సుమారు 20 మందితో ప్రారంభమైన డిఇ షా ఇండియా ప్రస్థానం ఇవ్వాళ హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరించింది. సాంకేతికత, ఆర్థిక పరిశోధన, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కార్పొరేట్ విభాగాల్లోని సంస్థ బృందాలు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయి" అని మంత్రి తెలిపారు.

మూడు దశాబ్దాలుగా డీఈ షా సాధించిన వృద్ధి హైదరాబాద్ ఎదుగుదలతో ముడిపడి ఉందన్నారు. నగరం ఇప్పుడు ప్రపంచస్థాయి సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు కేంద్రంగా మారిందని చెప్పారు.

"హైదరాబాద్ గత మూడు దశాబ్దాల్లో ఎంతో మారింది. సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగింది. యువతలోని నైపుణ్యం, ప్రతిభే మన ప్రధాన బలం" అని శ్రీధర్‌బాబు అన్నారు.

ప్రపంచ సంస్థలు కేవలం తమ కార్యకలాపాలను నిర్వహించే ప్రదేశంగా కాకుండా.. కొత్త ఆవిష్కరణలు, అత్యున్నత విలువ కలిగిన కార్యకలాపాలు, భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా ఎంచుకునేలా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

"ప్రపంచ సంస్థలు ఇక్కడ విస్తరించాలి. ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. అత్యున్నత నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను సృష్టించాలి. ఇందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది" అని చెప్పారు.

డిఇ షా నియోపోలిస్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయాన్ని మంత్రి స్వాగతించారు. హైదరాబాద్‌పై సంస్థకు ఉన్న దీర్ఘకాలిక నమ్మకానికి ఇది మరో నిదర్శనమన్నారు.

"నియోపోలిస్‌లో డిఇ షా ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయం కేవలం మరో కార్యాలయం కాదు. హైదరాబాద్ భవిష్యత్తుపై, తెలంగాణ వృద్ధి ప్రయాణంపై ఆ సంస్థకు ఉన్న విశ్వాసానికి ఇది బలమైన సంకేతం" అని శ్రీధర్‌బాబు అన్నారు.

కొత్త కార్యాలయం ద్వారా హైదరాబాద్‌లో డీఈ షా కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

"ఈ విస్తరణను తెలంగాణ స్వాగతిస్తోంది. రానున్న రోజుల్లో డీఈ షా రాష్ట్రంలో మరింతగా విస్తరిస్తుందని ఆశిస్తున్నాం" అని మంత్రి చెప్పారు.

ప్రపంచస్థాయి సంస్థల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

"డిఇ షా నాయకత్వానికి నేను హామీ ఇస్తున్నాను. మీ వృద్ధి, విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది. మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణలో సౌలభ్యం, ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యం ఇస్తాం" అని శ్రీధర్‌బాబు అన్నారు.




ప్రపంచ సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు తెలంగాణను మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# ఓటు హక్కును హరించే ప్రయత్నాలను వ్యతిరేకించాలి: ప్రొఫెసర్ కోదండరాం

**- SIR, Form-6 మార్పులపై ఆందోళన.. రేపు అంబేద్కర్ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు అఖిలపక్ష ర్యాలీ..**

**- టి.జె.ఎస్ నూతన కార్యవర్గ ప్రకటన..**

**- ఆర్టీసీ ఎన్నికల్లో TWUకు టి.జే.ఎస్ మద్దతు..**

హైదరాబాద్: ఓటు హక్కును రకరకాల పద్ధతుల్లో నిరాకరించడం, అర్హులైన వారి ఓట్లను తొలగించడం అన్యాయమని, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను అందరూ కలిసి వ్యతిరేకించాలని తెలంగాణ జన సమితి అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఈరోజు నాంపల్లిలోని టి.జే.ఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ఓటు హక్కుకు అమితమైన ప్రాధాన్యత ఉందని, అది ప్రతి మనిషికి ఒక గుర్తింపునిస్తుందని, ఈ సమాజంలో ఆత్మగౌరవంతో జీవించడానికి అవకాశం కల్పిస్తుందని అన్నారు. ప్రాణం ఉన్న ప్రతి వయోజనుడికి ఓటు వేసే అధికారం ఉండాలని, మనుషులందరూ సమానమే అన్నప్పుడు వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించాల్సి ఉండగా, ఆ అధికారాన్ని రకరకాల పద్ధతులతో అణిచివేయడం, నిరాకరించడం అన్యాయమని, చట్టవ్యతిరేకమని అన్నారు. ఎన్నికల కమిషన్ వ్యవహరించాల్సిన విధంగా వ్యవహరించడం లేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. ముగ్గురు సభ్యులు కలిసి సమావేశమై నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండగా, వారు సక్రమంగా సమావేశం కావడం లేదని, ఏకపక్షంగా ఒక సభ్యుడు నిర్ణయాలు తీసుకుంటున్నారనే విషయాలు ఇటీవల వార్తల్లో వెలుగులోకి వచ్చాయని అన్నారు. కమిషన్ పనిచేయకుండా కమిషన్ పేరుతో నిర్ణయాలు జరగడానికి వీల్లేదని, దీనిపై ప్రజాస్వామ్యవాదులంతా అభ్యంతరం వ్యక్తం చేయాలని కోరారు. ఖీశీతీఎ-6కు సంబంధించి చట్టబద్ధంగా మార్పులు సూచించే అవకాశం ఎన్నికల కమిషన్‌కు ఉన్నప్పటికీ, తనకు తానుగా ఎలాంటి మార్పులైనా చేసే అధికారం లేదని అన్నారు. ఖీశీతీఎ-6లో మార్పులకు సంబంధించి సుప్రీంకోర్టు కూడా స్పష్టత ఇచ్చిందని, తాము ఆ మార్పులను ఆమోదించలేదని, ఆమోదించినట్లు ఏమైనా రికార్డులు ఉంటే చూపించాలని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. ఎన్నికల కమిషన్ అక్రమంగా వ్యవహరించడం ప్రమాదకరమని అన్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు కీలకమైనదని, ప్రజలను ఓటు హక్కు లేకుండా చేయడం వారి హక్కులను దెబ్బతీయడమే కాకుండా ప్రజాస్వామ్యానికి కూడా ప్రమాదకరమన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లు తొలగించబడ్డాయని ఆయన ఆరోపించారు. తెలంగాణలో సుమారు 93 లక్షల ఓట్లు, అంటే ప్రతి వంద మందిలో 21 మంది ఓట్లను తొలగించే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. ఇంత అన్యాయంగా ఓట్ల నమోదు ప్రక్రియ కొనసాగడం ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రక్రియగా అభివర్ణించారు. ఎన్నికల కమిషన్ ప్రజలు పాలకులను ఎన్నుకునే ప్రక్రియను నిర్వహించాల్సి ఉండగా, ప్రస్తుతం పాలకులే ప్రజలను నిర్ణయించే ప్రయత్నం చేస్తున్నారని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. ఎన్నికల కమిషన్ ఎవరు గెలవాలని నిర్ణయించే స్థాయికి వెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఈ కుట్రను అందరూ కలిసి వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఓటర్ల పేర్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల పేరుతో కూడా పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. సుమారు 40 వేల మంది ఓటర్లను తొలగించే ప్రయత్నం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనికి సంబంధించి ఫిర్యాదులు, దరఖాస్తులు నమోదయ్యాయని, ఒకరిద్దరిపై కేసులు కూడా పెట్టినట్లు సమాచారం ఉందన్నారు. మొత్తంగా ఓట్లను తొలగించే ప్రక్రియను అందరూ కలిసి ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు.

రేపు ఉదయం 10.30 గంటలకు నెక్లెస్ రోడ్డులోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు అఖిలపక్ష ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో రాజ్‌భవన్‌గా ఉన్న ప్రదేశాన్ని ప్రస్తుతం లోక్‌భవన్‌గా పిలుస్తున్నామని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో పార్టీలకు, సిద్ధాంతాలకు అతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు నడిచి వెళ్లి నిరసనను బలంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.




టి.జె.ఎస్ నూతన కార్యవర్గం

ఈ సమస్యను సీరియస్‌గా తీసుకుని టి.జే.ఎస్ తన కార్యాచరణను మరింత వేగవంతం చేస్తుందని తెలిపారు. పార్టీకి సంబంధించిన కార్యవర్గ మార్పులు, చేర్పులు కొంతకాలంగా వివిధ పని ఒత్తిళ్ల కారణంగా ఆలస్యమయ్యాయని, ఇప్పుడు కొత్త కార్యవర్గాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో తీసుకున్న నిర్ణయాల ప్రకారం పార్టీ అధ్యక్షుడిగా తాను కొనసాగుతానని, మిగతా కార్యవర్గాన్ని సంప్రదింపుల ద్వారా ఎంపిక చేసే అధికారం లభించిందని ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. టి.జే.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు, సయ్యద్ బద్రుద్దీన్, అంబటి శ్రీనివాస్, కుంట్ల ధర్మార్జున్, ముక్కెర రాజు; కోశాధికారిగా పల్లె వినయ్ కుమార్ గౌడ్; ప్రధాన కార్యదర్శులుగా గోపగాని శంకర్ రావు, డోలి సత్యనారాయణ, బైరి రమేష్, మొగుడంపల్లి ఆశప్ప, నిజ్జన రమేష్ ముదిరాజ్, కంతి మోహన్ రెడ్డి; అధికార ప్రతినిధిగా సయ్యద్ సలీం పాషా; ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి. బాబన్న, ఆలూరి ప్రకాశ్ గౌడ్, బొజ్జ కనకయ్య, మల్లెల రామనాథం, కె.వి. రంగారెడ్డి, దేశపాక శ్రీనివాస్, సయ్యద్ ముజాహిద్; జాయింట్ సెక్రటరీలుగా ఆర్. లక్ష్మి, బద్రగామ అంజనేయులు; ఆఫీస్ సెక్రటరీగా వి. హనుమంత్ రెడ్డిని నియమించినట్లు ప్రకటించారు.

టి.జే.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. భారతదేశంలోని మెజారిటీ ప్రజలు, పేదలు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు, ముస్లిం మైనార్టీలు, చదువుకున్న యువతలో చాలామంది బీజేపీ ప్రభుత్వ పాలనా విధానాలను వ్యతిరేకిస్తున్నారని అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తున్న తీరు రాజ్యాంగ విరుద్ధంగా ఉందని ఆరోపించారు. ఆయన చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా కొనసాగడానికి అర్హత లేదని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ ప్రభుత్వం చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను ప్రభావితం చేసి డేటా సేకరణకు పాల్పడుతోందని అధికార ప్రతినిధి సలీమ్ పాషా ఆరోపించారు. ఓటర్ల డేటాను సేకరించడం చట్టవిరుద్ధమైన చర్య అని, ఇటువంటి చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు రేపు జరగబోయే అఖిలపక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ ఎన్నికల్లో ుఔఖకు టి.జే.ఎస్ మద్దతు

ఆర్టీసీ ఎన్నికల్లో తెలంగాణ వర్కర్స్ యూనియన్ (ుఔఖ)కు తెలంగాణ జన సమితి మద్దతు ప్రకటించింది. అశ్వద్ధామ రెడ్డి నాయకత్వంలోని కూటమికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని, అనంతరం కార్మికుల సమస్యల కోసం పోరాటాన్ని కొనసాగించిన సంఘంగా నిలిచిందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఎన్నికల్లో ుఔఖ బాణం గుర్తుపై పోటీ చేస్తున్న కూటమికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## నేడు కాలేయ వ్యాధిగ్రస్తులకు ఉచిత ఫైబ్రో స్కాన్...



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ మణికంఠ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నందు కాలేయ వ్యాధిగ్రస్తులకు , లివర్ సమస్య ఉన్నవారికి ఈనెల 8న గురువారం నాడు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉచితంగా ఫైబ్రో స్కాన్ నిర్వహిస్తున్నట్లు గ్యాస్ట్రాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ మణికంఠ జగదీష్ తెలిపారు.నాగర్ కర్నూల్ జిల్లాలోని లివర్ సమస్య ఉన్నవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, మద్యపానం అలవాటు ఉన్నవారు, ఫ్యాటీ లివర్ ఉన్నవారు, ధూమపానం అలవాటు ఉన్నవారు తప్పనిసరిగా పాల్గొని ఉచితంగా 5వేల రూపాయలు విలువగల ఫైబ్రోస్కాన్ ను ఉచితంగా చేయించుకోవాలని ఆయన తెలిపారు. రోగులు,వ్యాధి అనుమానితులు సెల్ నెంబర్ 9885880155, 9885880166 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## బైరాన్ పల్లి లో బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు

మద్దూరు (ధూళిమిట్ట): సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామంలో బతుకమ్మ పండుగ కోసం గ్రామ సర్పంచ్, సర్పంచుల పోరం జిల్లా కార్యదర్శి బర్మ రాజమల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా గ్రామంలో నలువైపులా వీధిలైట్ల ఏర్పాటు, బతుకమ్మ ఆడుకునే ప్రదేశాలను శుభ్రం చేస్తున్నారు. బతుకమ్మ నిమజ్జనం చేసేందుకు వీలుగా చెరువు వద్ద పలు ఏర్పాటు చేస్తున్నారు. చెరువు వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ప్రత్యేకగా నిలిచే బతుకమ్మ వేడుకలను గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ తెలిపారు.

## మద్యం తాగి వాహనం నడిపిన 35 మందికి జరిమానా..జైలు శిక్ష




హైద్రాబాద్ అక్టోబర్ 7:మద్యం తాగి వాహనం నడిపిన 35 మందిపై కేసులు నమోదు చేసిన కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు నాంపల్లి లోని ఎనిమిదవ జర్నలిస్టు మెన్ ఫర్ ఫస్ట్ క్లాస్ (VIII JMFC) కోర్టు లో హాజసరు పరిచారు.వీరిలో - మొదటిసారి: 2/వారానికి--19X 5,100 = 96,900/-,

4/వారానికి--02X 10,100 = 20,200/-.

రెండవసారి: జరిమానా మరియు సామాజిక సేవ 2/వారానికి-5X 5,100= 25,500/- ,పదేపదే మద్యం తాగి వాహనం నడిపిన నేరస్థులలో, కోర్టు జరిమానాలతో పాటు 2 రోజుల నుండి 10 రోజుల వరకు జైలు శిక్ష విధించింద- రెండవసారి: 6 మందికి 2 రోజుల జైలు మరియు జరిమానా.

మూడవసారి: 1 వ్యక్తికి 4 రోజుల జైలు మరియు జరిమానా.

4వ సారి: ఇద్దరికి 10 రోజుల జైలు శిక్ష మరియు జరిమానా.

విధించిన మొత్తం జరిమానా: ?1,99,500/-విధించింది.

ఈ సందర్భంగా ఎస్.హెచ్.ఓ. కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ఇన్స్పెక్టర్ బి.వి. కౌశిక్ మీడియాతో మాట్లాడుతూ

రోడ్డు ప్రమాదాలను నివారించడానికి మరియు రోడ్డుపై ప్రయాణించే వారందరి ప్రాణాలను కాపాడటానికి, మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపడం/ప్రయాణించడం మానుకోవాలని మరియు ట్రాఫిక్ భద్రతా నియమాలను పాటించాలని వాహనదారులందరికీ విజ్ఞప్తి చేసారు.

## ఐలాపూర్ సమ్మక్క సారక్క మహా జాతర తేదీలు ఖరారు చేసిన పూజారులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 07 కన్నాయి గూడెం** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్ లో నిర్వహించబోయే ఆదివాసుల గిరిజన మహా జాతర ఆసియా ఖండంలో అతిపెద్ద జాతరైన మేడారం జాతర తర్వాత మరో పెద్ద జాతరగా పిలువబడే ఐలాపూర్ సమ్మక్క సారక్క మహా జాతర ఆదివాసులు ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున వారి ఆరాధ్య దైవంగా కొలుస్తున్న సమ్మక్క సారక్క దేవతల జాతరను అంగరంగ వైభవంగా జరుపుకుంటారు అనేక ప్రాంతాల నుండి ఈ జాతరను చూడడానికి ఛత్తీస్గడ్ మహారాష్ట్ర బీజాపూర్ ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల నుంచి చాలామంది భక్తులు తల్లులను దర్శించుకుని వారి మొక్కులను తీర్చుకుంటారు మేడారం జాతర రెండు సంవత్సరాలకు ఒక్కసారి జరిగే మహా జాతర అలాగే ఐలాపూర్ లో ప్రతి సంవత్సరం లాగానే 2027. లో ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు జాతర నిర్వహిస్తున్నట్లు పూజారులు ప్రకటించారు

17 02 2027 నాడు బుధవారం రోజున సర్వాయి నుండి సారలమ్మ గద్దెకు వచ్చుట

18 02 2027 నాడు గురువారం సమ్మక్క దేవత గద్దె కు వచ్చుట

19 02 2027 నాడు శుక్రవారం రోజున సమ్మక్క సారక్క తల్లుల మొక్కులు తీర్చుట

20 02 2027 నాడు శనివారం సమ్మక్క సారక్క దేవతల వన ప్రవేశం

కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఇట్టి మహా జాతర తిలకించి సమ్మక్క సారక్క తల్లుల ఆశీర్వాదాలు పొందాలని పూజారుల సంఘం తెలిపారు

## సిరిసిల్ల పాలిటెక్నిక్ అధ్యాపకురాలికి డాక్టరేట్




**రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 7, ( ప్రజాబలం ప్రతినిధి )**సిరిసిల్ల జిల్లా లోని ఎస్ఆర్ఆర్ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం లెక్చరర్ అక్కెల కృష్ణవేణి డాక్టరేట్ సాధించారు. హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ రాజేందర్ బోయిని పర్యవేక్షణలో ఆమె పరిశోధన పూర్తి చేశారు.పీవీ అప్లికేషన్స్ కోసం తక్కువ వోల్టేజ్ ఒత్తిడి,పరిమిత విడిభాగాలతో పనిచేసే ట్రాన్స్‌ఫార్మర్ రహిత హై-గెయిన్ బూస్ట్ కన్వర్టర్ అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. పరిశోధన క్రమంలో ఆమె 5 అంతర్జాతీయ స్కోపస్ పరిశోధనా పత్రాలను సమర్పించారు. డాక్టరేట్ సాధించిన కృష్ణవేణిని కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రభాకరచారి, అధ్యాపక బృందం, కుటుంబ సభ్యులు అభినందించారు.

## వరంగల్లో హైడ్రా తరహా ఆపరేషన్

వరంగల్ లోని భద్రకాళి ఆలయ సమీపంలోని చెరబండ రాజు కాలనీ లో అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అక్కడికి పోలీసులు భారీగా చేరుకున్నారు. భారీ ఎత్తున కూల్చివేతలు కొనసాగాయి. అడ్డుకున్న వాళ్లని పోలీసు బలగాలు ఈడ్చి పడేశాయి. దాంతో కాలనీవాసులు పోలీసులపై తిరగబడ్డారు. మహిళలు సీఐ కరుణాకర్తో వాగ్వాదానికి దిగారు. బాధితులు బోరున విలపిస్తూ కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని మట్టెవాడ పోలీస్ స్టేషను తరలించారు. వారంతా పోలీస్ స్టేషన్లో ఆందోళన నిర్వహించారు. పలుసార్లు పోలీసులు, గుడిసెవాసుల మధ్య తోపులాట జరిగింది. ఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. మరో వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేయడంతో అతడిని అరెస్ట్ చేసి మట్టేవాడ పోలీస్ స్టేషన్కు తరలించారు.

# ఐదు లక్ష్యాలు నిర్దేశిస్తూ.. భారతీయులకు సరికొత్త నినాదం ఇచ్చిన ప్రధాని మోదీ



**'మనం సాధించగలం' అంటూ మోదీ నినాదం**
**ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని మోదీ**
**2047 నాటికి వికసిత భారత్‌తో పాటు ఐదు భారీ లక్ష్యాల ప్రకటన**

ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" (We Will Do It) అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం ముందు ఐదు భారీ లక్ష్యాలను ఉంచి, వాటిని సాధించి తీరాలని పిలుపునిచ్చారు.

సరిగ్గా పాతికేళ్ల క్రితం, 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోదీ తొలిసారిగా గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కేశూభాయ్ పటేల్ తర్వాత రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రత్యేకమైన రోజును కేవలం జ్ఞాపకాలకే పరిమితం చేయకుండా, దేశం కోసం కొత్త సంకల్పం తీసుకునే రోజుగా ఆయన మలిచారు. "ఈ రోజు కేవలం గతాన్ని స్మరించుకునేది మాత్రమే కాదు, మన సంకల్పంలో కొత్త శక్తిని నింపే రోజు. మనం ఏదైనా సాధించగలమనే వాగ్దానాన్ని పునరుద్ఘాటించే రోజు" అని మోదీ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యంతో పాటు మరో ఐదు కీలక లక్ష్యాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచారు. అవి:

1. ప్రపంచంలోని మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్‌ను నిలపడం.
2. ఆత్మనిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి) సాధించడం.
3. భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా (గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్) తీర్చిదిద్దడం.
4. ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడం.
5. అంతరిక్షంలోకి మానవసహిత యాత్రను చేపట్టడం.

ప్రధాని మోదీ ఒక్కో లక్ష్యాన్ని ప్రకటిస్తున్నప్పుడు, స్టేడియంలోని వేలాది మంది ప్రజలు "మనం సాధించగలం" అంటూ మిన్నంటేలా నినదించారు. ఈ ఉత్సాహం, ఆత్మవిశ్వాసం అసాధారణమైనవని ప్రధాని ప్రశంసించారు.

సంక్షోభాలను ఎదుర్కొని నిలిచాం

గతంలో సంక్షోభాలు తలెత్తినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యేదని, కానీ నేడు సంక్షోభ సమయాల్లో భారత్ చూపుతున్న పటిష్ఠత, స్థితిస్థాపకత గురించి ప్రపంచం చర్చించుకుంటోందని మోదీ అన్నారు. "ఒకప్పుడు దేశంలో విధానపరమైన స్తబ్దత (పాలసీ పారాలిసిస్) గురించి చర్చ జరిగేది. నేడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్ గురించి మాట్లాడుకుంటున్నారు" అంటూ అప్పటి యూపీఏ-2 ప్రభుత్వాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

చిన్న లక్ష్యాలు పెట్టుకోవడం దేశ సామర్థ్యాన్ని తక్కువ చేయడమేనని, అందుకే భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాలన్నీ 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకేనని మోదీ స్పష్టం చేశారు.

సవాళ్ల నడుమ స్ఫూర్తి నింపే ప్రయత్నం

ప్రతిపక్షాల నుంచి విమర్శలు, నిరసనలు ఎదురవుతున్న తరుణంలో, ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణుల్లో, మద్దతుదారుల్లో మోదీ ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నం చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) విషయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ సాగుతున్న నిరసనలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆరోపణలు, యూజీసీ మార్గదర్శకాలపై వ్యతిరేకత వంటి సవాళ్లను ప్రభుత్వం ఎదుర్కొంటోన్న నేపథ్యంలో, ప్రధాని ప్రసంగం బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది.

# రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ 3-పాయింట్ ఫార్ములా.. అవేంటంటే?

**ఇంధన కేంద్రాలపై దాడులు ఆపాలని సూచన**
**ధాన్యం, ఇంధన రవాణా కొనసాగించాలని హితవు**
**వాణిజ్య నౌకలపై దాడులు ఆపాలని ప్రతిపాదన**
**నల్ల సముద్రంలో వాణిజ్యానికి భద్రత కల్పించాలన సూచన**
**2024లో జైశంకర్ కీవ్ పర్యటనలో ప్రతిపాదన**



రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో ఏర్పడుతున్న నష్టాన్ని తగ్గించేందుకు భారత్ కీలక ప్రతిపాదన చేసింది. యుద్ధం వెంటనే పూర్తిగా ఆగకపోయినా.. దాని ప్రభావాన్ని తగ్గించేలా మూడు అంశాలతో కూడిన సంధి ప్రణాళికను సూచించింది. ఇంధన కేంద్రాలపై దాడులు ఆపడం, నల్ల సముద్రం ద్వారా ధాన్యం, ఇంధన రవాణాను కొనసాగించడం, వాణిజ్య నౌకలపై దాడులు నిలిపివేయడం ఇందులో ఉన్నాయి. భారత్ ప్రతిపాదించిన తొలి అంశం ఇంధన కేంద్రాలు, ఇతర కీలక మౌలిక వసతులపై దాడులు నిలిపివేయడం. విద్యుత్, ఇంధన వ్యవస్థలు దెబ్బతినకుండా చూడటం ద్వారా ప్రజల రోజువారీ జీవితం, ఆర్థిక కార్యకలాపాలపై యుద్ధ ప్రభావాన్ని తగ్గించవచ్చని భారత్ భావిస్తోంది.

రెండో అంశం నల్ల సముద్రం రేవుల నుంచి ధాన్యం, ఇంధనం, సరకుల రవాణా కొనసాగించడం. యుద్ధం కారణంగా కీలక సరఫరా మార్గాలు దెబ్బతినకుండా చూడాలని భారత్ సూచించింది. ఆహారం, ఇంధన సరఫరాలో అంతరాయం రాకుండా ఇది ఉపయోగపడుతుందని భావిస్తోంది.

మూడో అంశం వాణిజ్య నౌకల భద్రత. నల్ల సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులు పూర్తిగా ఆపాలని భారత్ ప్రతిపాదించింది. ఇప్పటివరకు జరిగిన చర్చల్లో ధాన్యం రవాణాకు ఎక్కువ ప్రాధాన్యం ఉండగా.. భారత్ మాత్రం అన్ని వాణిజ్య నౌకలకు భద్రత కల్పించే అంశాన్ని ముందుకు తెచ్చింది.

ఇదే భారత ప్రతిపాదనను ప్రత్యేకంగా నిలబెడుతోంది. గతంలో వచ్చిన కొన్ని ప్రతిపాదనలు ధాన్యం రవాణాపైనే దృష్టి పెట్టాయి. అమెరికా ప్రతిపాదన ప్రధానంగా ఇంధన కేంద్రాలపై దాడులు ఆపే అంశానికి పరిమితమైంది. భారత్ మాత్రం ఇంధన వసతులు, సరకుల రవాణా, వాణిజ్య నౌకల భద్రతను ఒకే ప్రణాళికలో చేర్చింది.

విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ 2024 సెప్టెంబరు 3న కీవ్ పర్యటన సందర్భంగా ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చినట్లు సమాచారం. రష్యా-ఉక్రెయిన్ వివాదానికి చర్చలు, దౌత్య మార్గమే పరిష్కారమని భారత్ మొదటి నుంచి చెబుతోంది. యుద్ధం పూర్తిగా ముగిసే వరకు కనీసం కీలక రంగాల్లో దాడులను తగ్గించడం ద్వారా నష్టాన్ని నియంత్రించాలన్నది ఈ ప్రతిపాదన ఉద్దేశం.

# 25 ఏళ్లలో భారత్ దిశ మార్చారు.. మోదీపై సీఎం చంద్రబాబు ప్రశంసల జల్లు

**ప్రజల విశ్వాసమే మోదీ బలమన్న సీఎం చంద్రబాబు**
**భారత్ మౌలిక వసతుల్లో వేగంగా ముందుకెళ్లిందని వెల్లడి**
**టెక్నాలజీ వినియోగంపై మోదీకి కితాబు**
**అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థలకు ప్రోత్సాహమని వెల్లడి**
**ప్రపంచ వేదికపై భారత్ ప్రభావం పెరిగిందని వ్యాఖ్య**
**'వికసిత్ భారత్ 2047'పై చంద్రబాబు విశ్వాసం**



ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా ప్రభుత్వ పదవిలో కొనసాగడం అసాధారణ ప్రయాణమని ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజల విశ్వాసమే ఆయన నాయకత్వానికి ప్రధాన బలమని పేర్కొన్నారు. 2026 అక్టోబర్ 7తో మోదీ ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ది హిందూ'లో రాసిన వ్యాసంలో చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీ రాజకీయాలతో మాత్రమే ఇంతకాలం నాయకత్వాన్ని కొనసాగించలేదని చంద్రబాబు అన్నారు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించారని పేర్కొన్నారు. వ్యక్తిగత నిజాయతీ, క్రమశిక్షణ, పనితీరు ఆ విశ్వాసానికి కారణమని తెలిపారు.

మారుతున్న ప్రపంచంలో స్థిరమైన భారత్

ప్రపంచ ఆర్థిక సంక్షోభాలు, కరోనా మహమ్మారి, యుద్ధాలు, భౌగోళిక మార్పులు, సాంకేతిక విప్లవం, ఆర్థిక అనిశ్చితి మధ్య భారత్ స్థిరంగా ముందుకు సాగిందని చంద్రబాబు పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో మౌలిక వసతులు వేగంగా విస్తరించాయని, సంక్షేమ పథకాల అమలు బలోపేతమైందని తెలిపారు.

2014లో 91,287 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారుల నెట్‌వర్క్ ఇప్పుడు 1.46 లక్షల కిలోమీటర్లు దాటిందన్నారు. విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 160కు పైగా పెరిగిందని తెలిపారు. పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం దాదాపు 296 గిగావాట్లకు చేరిందని వివరించారు.

టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి

మోదీకి సాంకేతికతపై మంచి అవగాహన ఉందని చంద్రబాబు ప్రశంసించారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా బ్యాంకింగ్, సంక్షేమం, ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా చేరుతున్నాయని చెప్పారు. క్వాంటమ్ మిషన్, సెమీకండక్టర్ మిషన్, పీఎల్ఐ పథకాలు భారత్‌ను సాంకేతికంగా మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాల్లో భాగమన్నారు.

అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థలకు అవకాశం ఇవ్వడం వల్ల కొత్త తరం పారిశ్రామికవేత్తలకు అవకాశాలు పెరిగాయని తెలిపారు. కేంద్రం నుంచి మాత్రమే దేశాభివృద్ధి సాధ్యం కాదని మోదీ నమ్ముతారని, రాష్ట్రాలు, నగరాలకు పెద్ద పాత్ర కల్పించారని చంద్రబాబు పేర్కొన్నారు.

'వికసిత్ భారత్' దిశగా

ప్రపంచ వేదికపై భారత్ ప్రభావం పెరిగిందని చంద్రబాబు అన్నారు. జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే ఇతర దేశాలతో భాగస్వామ్యాలను బలోపేతం చేస్తోందని తెలిపారు. భారత్‌కు యువ జనాభా, వ్యాపార స్ఫూర్తి, సాంకేతిక సామర్థ్యం బలాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో గత 25 ఏళ్లలో ఏర్పడిన దిశ, సంస్థాగత బలం 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని సాధించేందుకు ఉపయోగపడుతుందని చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు.

## గాడిన పడుతున్న ఆర్థిక వ్యవస్థ

విజయవాడ, అక్టోబరు 7, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుడ్ న్యూస్. ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్న ఆ రాష్ట్రం ఇప్పుడు గాడిలో పడుతుంది. చంద్రబాబు దార్శనీయకమైన పరిపాలన ఆ రాష్ట్రానికి ఆయువు పట్టు లాగా మారింది. ఆయన నాయకత్వంలో ఏపీ రాష్ట్రం అనేక రంగాలలో అభివృద్ధి సాధిస్తోంది. ఇప్పుడు ఏకంగా జాతీయ సగటును మించిపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖజానాకు జీఎస్టీ వసూళ్లు ఊరట కలిగించే విధంగా ఉన్నాయి. రాష్ట్రంలో పన్ను ఆదాయం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక కార్యకలాపాలలో కదలిక కొనసాగుతోంది. ముఖ్యంగా 2026 సెప్టెంబర్ లో ఏపీ నెట్ జిఎస్టి వసూళ్లు జాతీయ వృద్ధి సగటును మించిపోయాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేస్తోంది. 2026 సెప్టెంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ నెట్ జిఎస్టి వసూళ్లు 3,182.87 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది వసూళ్లు సెప్టెంబర్ నెలలో 2,789.50 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే వసూళ్ల వృద్ధి 14.1 సున్న శాతంగా నమోదయింది. ఇక ఇదే సమయంలో జాతీయస్థాయిలో పోస్ట్ సెటిల్మెంట్ నెట్ జిఎస్టి వృద్ధి రేటు సాగటు 8 శాతం గా ఉంది. అంటే జాతీయ సగటుతో పోల్చి చూస్తే ఏ అభివృద్ధి గణనీయంగా నమోదయింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు పరిశీలిస్తే రాష్ట్ర నెట్ జిఎస్టి వసూళ్లు 19,635.49 కోట్లకు చేరుకున్నాయి. గత ఎడాది ఇదే కాలంలో 16,760.21 కోట్లుగా వసూళ్ళు ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే ఏకంగా 18% వృద్ధి నమోదయింది. మొత్తం కమర్షియల్ ట్యాక్స్ వసూళ్లు కూడా సెప్టెంబర్ నాటికి 30,435.98 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 25,892.92 కోట్లుగా ఉన్నది. గత ఏడాదితో పోల్చి చూస్తే వృద్ధిరేటు ఏకంగా 18% అధికంగా నమోదయింది. ఈ పెరుగుదలకు పన్ను చెల్లింపుల్లో మెరుగైన అనుసరణ.. కట్టుదిట్టమైన తనిఖీ.. రెవెన్యూ మానిటరింగ్.. ఆర్థిక కార్యకలాపాల విస్తరణ వంటివి కారణాలని అధికారులు చెబుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డేటా అనలటిక్స్.. యూపీఐ లావాదేవీల విశ్లేషణ.. ఐ జిఎస్టి రివర్సల్స్ డిస్కం ఆదారిత రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్ వంటి చర్యలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయడంతో ఆదాయం పెరిగిపోయింది.



ప్రభుత్వాధినేతగా బాధ్యతలు చేపట్టి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజేపీ అగ్రనేత ఎల్.కె. అద్వానీని కలిసిన ప్రధాని నరేంద్ర మోదీ. ఈ సందర్భంగా అద్వానీ దశాబ్దాల ప్రజాసేవ, దేశ నిర్మాణంలో ఆయన అందించిన సేవలు చెరగని ముద్ర వేశాయని కొనియాడిన ప్రధాని మోదీ.

# యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్..

# రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!

**బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ**

**గరిష్ఠ డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి**

**జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు.



ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని, కానీ ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి గుర్తుచేశారు. సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలింది దిగుమతి చేసుకుంటామని ఒప్పందాలు చేసుకున్నా, బీఆర్ఎస్ హయాంలో వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్‌ను నిర్మించారా లేదా అనే దానిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసి మూడు యూనిట్లను ప్రారంభించిందని భట్టి వివరించారు.

జెన్‌కో, ట్రాన్స్‌కోలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు విద్యుత్ అంశంపై రాద్ధాంతం చేస్తున్నాయని, తమ ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

## 15 నిమిషాలు శ్వాస ఆపి ఆశ్చర్యపరిచిన విద్యుత్ జమ్వాల్

ముంబైలో జరిగిన 'స్ట్రీట్ ఫైటర్' ప్రత్యేక కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు విద్యుత్ జమ్వాల్ అందరినీ ఆశ్చర్యపరిచారు. వేదికపై వరుసగా 15 నిమిషాల పాటు శ్వాసను నియంత్రిస్తూ ధ్యానం చేశారు. ధల్సిమ్ పాత్రలో నటిస్తున్న విద్యుత్ యోగా, కలరిపయట్టు వంటి భారతీయ కళల్లో తనకు ఉన్న నైపుణ్యాన్ని ఈ సందర్భంగా చూపించారు.హాలీవుడ్‌లో విద్యుత్ జమ్వాల్‌కు 'స్ట్రీట్ ఫైటర్' తొలి చిత్రం. ఇందులో ఆయన ప్రముఖ గేమింగ్ క్యారెక్టర్ ధల్సిమ్ పాత్రను పోషిస్తున్నారు. యోగా ఆయన సూపర్ పవర్‌గా ఉండే ఈ పాత్రకు విద్యుత్ సరిగ్గా సరిపోతారని ఈ కార్యక్రమం ద్వారా మరోసారి నిరూపించారు.ధల్సిమ్ వేషధారణలో ఉన్న కాస్ప్లేయర్లతో కలిసి విద్యుత్ వేదికపై 15 నిమిషాల పాటు మౌనంగా ధ్యానం చేశారు. అనంతరం తాను పాటంజలి యోగసూత్రాల్లోని ప్రత్యేకమైన పద్ధతిని ఉపయోగించానని తెలిపారు. ఈ టెక్నిక్ ద్వారా 15 నిమిషాల పాటు శ్వాసను నియంత్రిండంతో పాటు జీవితంలో ఎన్నో లక్ష్యాలను సాధించగలిగానని చెప్పారు. ఈ పద్ధతిని యువతకు కూడా నేర్పిస్తున్నట్లు వెల్లడించారు."యువతకు నేను ఒక్కటే చెప్పాలనుకుంటున్నాను. కొంతసేపు ఆగండి. అందరూ ఏదో ఒకటి సాధించేందుకు పరుగులు తీస్తున్నారు. కానీ ఒక్కసారి ఆగి, ప్రశాంతంగా ఉండటం నేర్చుకోండి. ఏమీ చేయకుండా కొంత సమయం ఉండండి. ఈ నైపుణ్యం మిమ్మల్ని జీవితంలో చాలా దూరం తీసుకెళ్తుంది. లక్ష్యాలను సాధించడానికి సమయం పడుతుంది.

# షామీ సూపర్ గుడ్ న్యూస్

హైదరాబాద్, అక్టోబరు 7,ఈ దీపావళికి కొత్త ఫోన్ కొనాలనుకునేవారికి షామీ సూపర్ గుడ్ న్యూస్ చెప్పింది. దీపావళి పండుగ సందర్భంగా కంపెనీ 'దీపావళి సేల్'ను ప్రకటించింది. ఈ ప్రత్యేక సేల్ అక్టోబర్ 8న ప్రారంభం కానుంది. ఎంపిక చేసిన స్మార్ట్‌ఫోన్‌లు, గాడ్జెట్లపై ఏకంగా 50% వరకు భారీ తగ్గింపును అందిస్తోంది. అంతేకాకుండా, కొన్ని ప్రత్యేక మోడళ్లతో పాటు ఆకర్షణీయమైన ఉచిత బహుమతులు కూడా లభిస్తున్నాయి.

రెడ్‌మీ ం7 ప్రో 5ఉపై భారీ డిస్కౌంట్

షామీకి చెందిన స్మార్ట్‌ఫోన్ రెడ్‌మీ ం7 ప్రో 5ఉపై బెస్ట్ డీల్ ఉంది. ఈ ఫోన్ అసలు ధర రూ.14,999 కాగా, పండుగ ఆఫర్ల ద్వారా దీనిని 50% వరకు తగ్గింపు ధరకు సొంతం చేసుకోవచ్చు. ఇందులో 6.9 ఇంచుల 120ఊళి డిస్‌ప్లే, యూనిసోక్ ూ8300 ప్రాసెసర్, 6300ఎంస్త్ర బ్యాటరీ, 32ఓఖ రియర్ కెమెరా ఉన్నాయి.

ఇతర మోడళ్లపై బెస్ట్ డీల్స్

షామీ 17 అల్ట్రా: బ్యాంక్ ఆఫర్లు, అదనపు తగ్గింపులతో ఈ ఫ్లాగ్‌షిప్ ఫోన్‌ను రూ. 129,999లకే సొంతం చేసుకోవచ్చు. దీంతో పాటు రూ. 19,999 విలువైన 'ఫోటోగ్రఫీ కిట్ ప్రో' ఫ్రీగా పొందవచ్చు.

షామీ 17ు: ఈ ప్రీమియం ఫోన్ సేల్‌లో రూ. 64,999 ధరకే లభిస్తుంది.

రెడ్‌మీ నోట్ 15 ూఇ: 6ఉః ఖీంఓ + 128ఉః స్టోరేజీ వేరియంట్ ధర రూ. 22,999 (లిస్టెడ్ ధర రూ. 25,999) నుండి స్టార్ అవుతుంది.

రెడ్‌మీ టర్బో 5 5ఉ: బ్యాంకు ఆఫర్ తర్వాత దీని ధర రూ. 37,999 (అసలు ధర రూ. 41,999)గా ఉంది.

రెడ్‌మీ నోట్ 17 సిరీస్: రెడ్‌మీ నోట్ 17 బేస్ మోడల్ రూ. 26,000 కంటే తక్కువ ధరకు, నోట్ 17 ప్రో రూ. 33,999, అలాగే నోట్ 17 ప్రో మాక్స్ రూ. 44,999 ధరలకే లభిస్తున్నాయి.

కేవలం డిస్కౌంట్ చూసి కాకుండా, కెమెరా, స్టోరేజీ, వర్కింగ్ లేదా బ్యాటరీ ఇలా అన్నీ బేరీజు వేసుకుని మోడల్‌ను సెలెక్ట్ చేసుకోండి. బ్యాంక్ డిస్కౌంట్ల కోసం సెలెక్ట్ చేసిన క్రెడిట్/డెబిట్ కార్డులను ఉపయోగించండి. పాత ఫోన్ ఎక్స్ఛేంజ్ విలువ దాని కండిషన్‌పై ఆధారపడి ఉంటుంది.

అక్టోబర్ 8న సేల్ ప్రారంభం కానున్నందున, మీకు నచ్చిన స్మార్ట్‌ఫోన్‌ను ముందుగానే కార్ట్‌లో ఉంచుకోవడం మంచిది.

# బైక్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం..

**ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి**

**చేవెళ్లలో ఘోర హిట్ అండ్ రన్..**

**చిన్నారికి తీవ్ర గాయాలు**



చేవెళ్ల: రోడ్డు ప్రమాదం ఒకే కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. చేవెళ్ల మండలం గొల్లపల్లి వద్ద బైక్‌పై వెళ్తున్న కుటుంబాన్ని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్య, భర్త, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. మరో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చిన్నారిని ఆస్పత్రికి తరలించారు.మృతులను మొయినాబాద్ మండలం మేడిపల్లికి చెందిన మధు, కుమ్మరి సావిత్రిగా గుర్తించినట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.

# 40 మంది పౌరసత్వాల రద్దుకు అమెరికా రంగం సిద్ధం!

న్యూఢిల్లీ, అక్టోబరు 7, అమెరికా ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మోసపూరిత మార్గాల్లో, నేర చరిత్రను దాచిపెట్టి అమెరికా పౌరసత్వం పొందిన 40 మంది విదేశీయుల పౌరసత్వాలను రద్దు చేయడానికి రంగం సిద్ధం చేసింది. వీరిలో ఒక భారతీయుడు కూడా ఉండటం గమనార్హం. అమెరికా ఆధునిక చరిత్రలో ఇదే అతిపెద్ద 'డీ-న్యాచురలైజేషన్' (పౌరసత్వ రద్దు) చర్యగా ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు అమెరికా న్యాయశాఖ (డీవోజే) ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది.న్యాయశాఖ వివరాల ప్రకారం, ఈ ఏడాది ఆగస్టు 21 నుంచి అక్టోబర్ 2 మధ్య దేశంలోని 19 ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టుల్లో మొత్తం 40 మందిపై సివిల్ కేసులు దాఖలు చేశారు. వీరంతా తీవ్రమైన నేరాలకు పాల్పడటం లేదా పౌరసత్వం కోసం దరఖాస్తు చేసేటప్పుడు కీలక వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా దాచి, తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. "గూఢచర్యం నుంచి మైనర్లపై లైంగిక నేరాల వరకు అనేక తీవ్రమైన నేరాలకు పాల్పడిన వీరు, తమ గతాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందారు" అని అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ తెలిపారు. పౌరసత్వ ప్రక్రియలో మోసాన్ని ఎంతమాత్రం సహించేది లేదని సివిల్ డివిజన్ అసిస్టెంట్ అటార్నీ జనరల్ బ్రెట్ ఎ. షుమేట్ స్పష్టం చేశారు.పౌరసత్వం రద్దు జాబితాలో కాలిఫోర్నియాలో నివసిస్తున్న 55 ఏళ్ల భారతీయుడు బల్విందర్ సింగ్ కూడా ఉన్నారు. ఇతను రెండు వేర్వేరు గుర్తింపులతో అమెరికా అధికారులను మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 1992లో ఒక ఐడెంటిటీతో ఇమ్మిగ్రేషన్ కోసం దరఖాస్తు చేసుకుని, ఆ తర్వాత 2003లో మరో ఐడెంటిటీతో పర్మినెంట్ రెసిడెంట్ హోదా పొందాడు. 2009లో రెండో ఐడెంటిటీతోనే పౌరసత్వం కూడా సంపాదించాడు. అయితే, వేలిముద్రల ఆధారంగా రెండు దరఖాస్తులు చేసింది ఒకే వ్యక్తి అని అధికారులు గుర్తించారు.ఈ జాబితాలో చైనాకు గూఢచర్యం చేశాడన్న ఆరోపణలపై 200 నెలల జైలు శిక్ష అనుభవిస్తున్న అమెరికా నౌకాదళ మాజీ సైనికుడు జిన్‌చావో వీ కూడా ఉన్నాడు. ఇతరులపై హత్య, మనీ లాండరింగ్, లైంగిక నేరాలు, పన్ను ఎగవేత, వివాహ మోసాలు వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. ఈ 40 మందిలో మెక్సికో, పాకిస్థాన్, చైనా, నేపాల్, ఇరాన్, నైజీరియాతో పాటు 20కి పైగా దేశాలకు చెందిన వారున్నారు.ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టం ప్రకారం, కోర్టులు వీరిపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలిస్తే పౌరసత్వం రద్దవుతాయి. ఆ తర్వాత వారిని దేశం నుంచి బహిష్కరించే (డిపోర్టేషన్) ప్రక్రియను ప్రారంభిస్తారు. ప్రస్తుతం ఈ కేసులన్నీ ప్రారంభ దశలోనే ఉన్నాయి.

# చండూర్ సబ్‌స్టేషన్ ముట్టడించిన రైతులు..

**9 నుంచి 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్**



మెదక్ అక్టోబర్ 7: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో-వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం చండూర్ గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించారు. వరి పంటలు చివరి దశలో ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంగా విద్యుత్ సరఫరాలో లో-వోల్టేజీతోపాటు తరచూ ట్రిప్పింగ్ జరుగుతోందని రైతులు తెలిపారు. దీంతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు. పంటలకు కీలకమైన సమయంలో విద్యుత్ సమస్య తలెత్తడంతో సాగునీరు అందించలేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. రోజుకు 9 నుంచి 12 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సమస్యను ఇప్పటికే ఏఈ, ఏఈడీల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆరోపించారు. విద్యుత్ సమస్య కారణంగా పంటలకు నష్టం వాటిల్లితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని స్పష్టం చేశారు.

# 3 వేల చెట్లు...300 కోట్లు..

# వీటి రివకరీ ఎవరు చేస్తారు...

హైదరాబాద్, అక్టోబరు 7, హైదరాబాద్ నగరంలో కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ ను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం భారీ హెచ్ సి ఐ టి ఐ ప్రాజెక్టును ప్రతిపాదించింది. అయితే ఇందులో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. దాదాపు 1090 కోట్ల అంచనాథ దీనిని చేపట్టాలని ప్రభుత్వం భావించింది. ఫ్లై ఓవర్లు.. అండర్ పాస్ లు నిర్మించాలని అనుకుంది. అయితే దీనిని ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పక్కనపెట్టింది. అయితే దీని అర్థం కేబీఆర్ ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టు పూర్తిగా రద్దు అయిపోయిందని కాదు.. దీని స్థానంలో కొత్త కాన్సెప్ట్ తో ఎలివేటెడ్ కారిడార్ ను తీసుకొస్తున్నది.కె.వి.ఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ప్రభుత్వం గతంలో భారీగా ప్రణాళిక రూపొందించింది. పలు జంక్షన్ ల వద్ద ఫ్లై ఓవర్లు.. అండర్ పాసులు.. స్టీల్ బ్రిడ్జిలు నిర్మించాలని అనుకుంది. 2024 లో ముందుగా ఈ పనులకు పరిపాలన అనుమతి తీసుకుంది. మొత్తంగా వీటి విలువ 826 కోట్లు అని అంచనావేసింది. ఆ తర్వాత వీటి విలువ పెరిగిపోయింది. మొత్తంగా 1090 కోట్లకు చేరుకుంది. కె.వి.ఆర్ పార్కు చుట్టూ ఉన్న ఎకో సెన్సిటివ్ జోన్ లో చెట్ల తొలగింపు విషయంలో న్యాయపరమైన అడ్డంకులు వచ్చాయి. దీంతో పనులు ముందుకు సాగలేదు. 2026 ఆగస్టులో కె.వి.ఆర్ పార్కు చుట్టూ క్లాక్ వైస్ వన్ వే ట్రాఫిక్ సిస్టంలో హైదరాబాద్ పోలీసులు అందుబాటులో తీసుకొచ్చారు. ముందుగా వాహనదారులకు కొంత గందరగోళం ఎదురైంది. ఆ తర్వాత సిగ్నల్ ప్రాంతాల వద్ద వేచి ఉండే సమయం తగ్గిపోయింది. దీంతో ట్రాఫిక్ సమస్య కాస్త తగ్గిపోయింది.. ఇటీవల ట్రాఫిక్ పోలీస్ కమిషనర్.. జిహెచ్ఎంసి కమిషనర్ కలిసి పరిస్థితిని సమీక్షించారు. వన్ వే విధానం సజావుగా సాగుతున్నట్టు గుర్తించారు.వన్ వే తో ట్రాఫిక్ మొత్తాన్ని సమర్థవంతంగా నిర్వహించగలిగితే వందల కోట్లు ఖర్చు చేసి ప్రతి జంక్షన్ వద్ద భారీ నిర్మాణాలు ఎందుకు అనే ప్రశ్న తెరమీదకి వచ్చింది. దీంతో పాత హెచ్ సిటీ విధానాన్ని పక్కనపెట్టి కొత్త పరిష్కారం మీద జిహెచ్ఎంసి దృష్టి పెట్టింది. అంటే కేబీఆర్ ఫ్లైఓవర్లు పూర్తిగా క్యాన్సిల్.. కాకపోతే పాత డిజైన్ మాత్రం కొనసాగుతుంది. మొత్తం హెచ్ సి ఐ టి ఈ ఆలోచన మాత్రం అలానే ఉంటుంది. జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ అక్టోబర్ 3న పాత ప్రణాళికలోని పలు ఫ్లై ఓవర్లు.. అండర్ పాస్ లను తొలగిస్తూ సవరించిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.రోడ్ నెంబర్ 45.. ఫిలింనగర్.. మహారాజా అగ్రసేన్.. క్యాన్సర్ హాస్పిటల్ వంటి ప్రాంతాలలో ప్రతిపాదించిన పలు నిర్మాణాలను జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ పక్కన పెట్టాలని నిర్ణయించింది. అదేవిధంగా ఎన్ఎఫ్సీఎల్ జంక్షన్.. టీవీ9 జంక్షన్ వద్ద ఉన్న కొన్ని పాత ప్రతిపాదనలు మారే అవకాశం ఉంది.. పంజాగుట్ట ఎన్ఎఫ్సీఎల్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు దాదాపు నాలుగు నాలుగు కిలోమీటర్ల ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ప్రతిపాదనకు జిహెచ్ఎంసి మొగ్గు చూపించింది. ఈ కారిడా ద్వారా పంజాగుట్ట పేపర్ నుంచి ఐటీ కాలర్ దిశగా వెళ్లే వాహనాలకు సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కల్పించాలి అనేది ప్రధాన ఉద్దేశం.ఇక ప్రాథమిక ప్రతిపాదన ప్రకారం ఎన్ ఎఫ్ సి ఎల్ జంక్షన్.. ముపాకం జ కాలేజీ ప్రాంతం.. జూబ్లీ చెక్‌పోస్ట్ అనే దిశలో ఎలివేటెడ్ మార్గం నిర్మించబోతున్నారు. ఇక ఇదే సమయంలో బంజర హిల్స్ రోడ్ నెంబర్ 1 వెళ్లే వాహనాల కోసం జలగం వెంగళరావు పార్క్ వైపు ప్రత్యేక ర్యాంపు ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉంది.. గతంలో కేబీఆర్ చుట్టూ ఉన్న ప్రతి జంక్షన్లో ఒక ఫ్లైఓవర్ లేదా అండర్పాస్ అన్నట్టుగా ఉండేది. ఇప్పుడు జంక్షన్ల దగ్గర సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరించడం కంటే ప్రధాన ట్రాఫిక్ ను ఒక పొడవైన ఎలివేటెడ్ కారిడార్ పైకి ఎక్కించి సిగ్నల్ ని మొత్తం దాటించడం.. అనే దిశగా మారిపోయింది.ప్రస్తుతం వన్ వే విధానం బాగానే పనిచేస్తుంది. కానీ హైదరాబాద్ కి రోజురోజుకు పెరుగుతోంది. ఐ టీ కాలర్ వైపు వెళ్లే వాహనాల సంచి కూడా భారీగానే ఉంటుంది. కాబట్టి ఈరోజు వన్ మీతో ట్రాఫిక్ కంట్రోల్ అయిందని రేపటి అవసరాలను అదే పరిష్కరిస్తుందా అనేది చూడాలి.. అందుకే ప్రభుత్వం పూర్తిగా నిర్మాణాలను వదిలేయకుండా ప్రధాన ప్రభాహానికి ఉపయోగపడే ఒక భారీ ఎలివేటెడ్ కారిడార్ వైపు మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది.

# కొత్త ల్యాండ్ పూలింగ్ తో అభివృద్ధి చేసిన ప్లాట్లు

హైదరాబాద్, అక్టోబరు 7, భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు భూసేకరణ ఖర్చు పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. భూములు తీసుకుని డబ్బులు చెల్లించే విధానానికి బదులుగా.. భూయజమానులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చేలా రాష్ట్రవ్యాప్తంగా కొత్త ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకురానున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం మూసీ ప్రక్షాళన, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ పరిధిలోని కొన్ని ప్రాజెక్టుల్లో ఈ విధానం అమలవుతోంది. అక్కడ మంచి ఫలితాలు వస్తే రాష్ట్రంలోని సాగునీరు, రహదారులు, భవనాలు సహా వివిధ శాఖల ప్రాజెక్టులకు దీనిని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఇందుకోసం తెలంగాణ సమగ్ర ప్రాంత అభివృద్ధి, ప్రణాళిక బిల్లు-2026ను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే హెచ్ఎండీఏ, పట్టణాభివృద్ధి సంస్థలు, జిల్లా కలెక్టర్లు సహా ప్రభుత్వం గుర్తించే ఇతర సంస్థలు ల్యాండ్ పూలింగ్ చేపడతాయి.రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, ప్రతిపాదిత బుల్లెట్ రైలు టెర్మినల్ వంటి ప్రాజెక్టులకు వేల ఎకరాలు అవసరం. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో భూముల అవసరం ఎక్కువగా ఉంది. దీంతో ప్రభుత్వం ఈ విధానంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.ఈ పథకంలో పట్టా భూముల యజమానులతో పాటు అసైన్డ్ భూములు, సీలింగ్ మిగులు భూములు, భూదాన్ భూములు, కొన్ని ప్రభుత్వ భూముల ఆక్రమణదారులకు కూడా ప్రయోజనం కల్పించనున్నారు. అయితే తిరిగి ఇచ్చే భూమి విస్తీర్ణం, భూమి హక్కు, ప్రాంతాన్ని బట్టి మారుతుంది.ఈ విధానంలో రెండు మార్గాలను ప్రతిపాదించారు. యజమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పూలింగ్ కోరితే దాన్ని 'కన్సెంట్ బేస్డ్ ల్యాండ్ పూలింగ్'గా పరిగణిస్తారు. రింగ్ రోడ్లు, పారిశ్రామిక కారిడార్లు, కొత్త పట్టణాల వంటి కీలక ప్రాంతాల్లో ప్రభుత్వం స్వయంగా చేపట్టే పూలింగ్‌ను 'గైడెడ్ ల్యాండ్ పూలింగ్'గా పేర్కొన్నారు.మూసీ ప్రాజెక్టు, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ ప్రాజెక్టులకు ఇప్పటికే ప్రభుత్వం జీవో 240, జీవో 243 జారీ చేసింది. వీటి ప్రకారం పట్టా భూములకు ఎకరానికి గరిష్ఠంగా 1,400 చదరపు గజాలు లేదా అభివృద్ధి చేసిన భూమిలో 50 శాతం వాటా.. ఏది తక్కువైతే అది లభిస్తుంది. సరస్సులు, నదుల బఫర్ ప్రాంతాల్లో ఎకరానికి 800 చదరపు గజాలు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాల్లో 400 చదరపు గజాల వరకు ఇవ్వనున్నారు.భూసేకరణ చట్టాన్ని పక్కన పెట్టేందుకే ఈ విధానం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలకు నోటీసులు, అభ్యంతరాలకు అవకాశం, పరిహారం, పునరావాసం వంటి నిబంధనలు కొనసాగుతాయని చెబుతున్నారు.

# డిసెంబర్ తర్వాత నీటికి కటకటే...

హైదరాబాద్, అక్టోబరు 7, భాగ్యనగరానికి తాగునీటి గండం పొంచి ఉంది. ఈ ఏడాది చివరి నాటికి హైదరాబాద్ నగరంలో తీవ్రమైన తాగునీటి సంక్షోభం తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావంతో నగరం యొక్క ప్రధాన నీటి వనరులైన జలాశయాల్లో నీటిమట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. అధికారులు ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు.హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్, పశ్చిమ ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే కీలకమైన సింగూర్ జలాశయం పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.9 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 3.9 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇది మొత్తం సామర్థ్యంలో కేవలం 13 శాతం మాత్రమే. వేసవిలో ఉన్న నీటి నిల్వలతో పోలిస్తే ఇది సగానికి పడిపోవడం గమనార్హం. ఇదే పరిస్థితి కొనసాగితే మరో 60 రోజుల్లో, అంటే డిసెంబర్ మధ్య నాటికే సింగూర్ జలాశయం పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని అధికారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.పాతబస్తీ, చుట్టుపక్కల ప్రాంతాలకు నీరందించే మరో ముఖ్యమైన వనరు ఉస్మాన్‌సాగర్ (గండిపేట) నీటిమట్టం కూడా గణనీయంగా తగ్గింది. గతంలో సుమారు 3.5 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ ఇప్పుడు 2.2 టీఎంసీలకు పడిపోయింది. వీటికి తోడు, నాగార్జున సాగర్‌తో అనుసంధానమైన జలాశయాలతో సహా ఇతర ప్రధాన రిజర్వాయర్లకు కూడా ఇన్‌ఫ్లోలు (నీటి చేరిక) భారీగా తగ్గిపోయాయి. దీంతో నగరంపై నీటి సంక్షోభ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి.పరిస్థితి తీవ్రతను గ్రహించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ) వెంటనే అప్రమత్తమైంది. సింగూర్, మంజీరా జలాలపై ఆధారపడిన ప్రాంతాలకు ప్రత్యామ్నాయ నీటి వనరులు, సరఫరా మార్గాలను గుర్తించి, అత్యవసర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.సాధారణంగా వేసవి కాలంలో ఎదురయ్యే నీటి ఎద్దడి, ఈసారి ముందుగానే డిసెంబర్ లేదా జనవరి నెలల నుంచే ప్రారంభమయ్యే అవకాశం ఉందని నీటిపారుదల శాఖకు చెందిన ఓ చీఫ్ ఇంజనీర్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 17 శాతం వర్షపాతం లోటు ఉందని అధికారికంగా ప్రకటించింది. వ్యవసాయ అవసరాల కంటే తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. మొత్తం మీద రాబోయే రోజుల్లో భాగ్యనగర వాసులు నీటి కష్టాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

దుర్గం చెరువు

హైదరాబాద్‌లోని ప్రఖ్యాత దుర్గం చెరువు సమగ్ర అభివృద్ధి, పునరుద్ధరణ కోసం ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) సిద్ధమవుతోంది. సుమారు 140 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రతిపాదనకు సోమవారం జరిగిన సీఎంసీ స్థాయీ సంఘం సమావేశంలో ఆమోదం లభించిందని అధికారులు తెలిపారు. ఈ ఎస్పీవీ ద్వారా చెరువు అభివృద్ధి ప్రాజెక్టును ప్రత్యేకంగా చేపట్టడంతో పాటు, ఈ కార్యక్రమానికి అవసరమైన నిధుల సమీకరణ కూడా సులభతరం అవుతుందని భావిస్తున్నారు.దుర్గం చెరువులోకి మురుగునీరు చేరకుండా అరికట్టేందుకు అధికారులు కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే చెరువు చుట్టూ నాలుగు ప్రధాన మురుగునీటి మార్గాలను గుర్తించి, వాటిని అడ్డగించి శుద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించారు. గతంలోనూ దుర్గం చెరువు చుట్టూ వాకింగ్, జాగింగ్ ట్రాక్‌లు, ఇతర ప్రజా సౌకర్యాలు కల్పించారు. తాజా నిర్ణయంతో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి.ఇదే సమావేశంలో మరికొన్ని కీలక ప్రతిపాదనలకు కూడా స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. చింతల కుంట చెరువు పునరుద్ధరణ కోసం రూ.21.59 కోట్లు, కూకట్‌పల్లి జోన్‌లో బాక్స్ డ్రెయిన్ పనుల పూర్తికి రూ.5.95 కోట్లు, గజులరామారం సర్కిల్ ఆఫీస్ భవన నిర్మాణానికి రూ.5.18 కోట్లు కేటాయించారు. మున్సిపల్ సమస్యలకు సాంకేతిక పరిష్కారాల కోసం తెలంగాణ ప్రభుత్వ సంస్థ అయిన టీ-వర్క్స్‌తో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ)కు కూడా ఆమోదం లభించింది.

# రేవంత్ ఎలివేషన్ మామూలుగా లేదుగా ఏఐసీసీ భేటీలో స్వాగ్

హైదరాబాద్, అక్టోబరు 7, కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుంచి ఇప్పటివరకు రేవంత్ రెడ్డి దూకుడుగానే వెళ్తున్నారు. పిసిసి అధ్యక్షుడిగా.. పార్లమెంటు సభ్యుడిగా.. ముఖ్యమంత్రిగా ఇలా భిన్న రకాల పాత్రలను పోషించారు. అందులో విజయవంతమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మహాసముద్రం లాంటిది. కాళ్లలో కట్టెలు పెట్టేవారు పెడుతూనే ఉంటారు. ఇబ్బంది పెట్టేవారు పెడుతూనే ఉంటారు. కాకపోతే వాటిని అధిగమించి ఆ స్థాయిలోకి రావడం అంటే మామూలు విషయం కాదు. దీనిని రేవంత్ రెడ్డి విజయవంతంగా పూర్తి చేశారు.ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ భేటీ జరిగింది.

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. వారంతా కూడా సర్ నిబంధన మీద తీవ్రంగా చర్చించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రూప్ ఫోటో దిగారు. ఈ ఫోటో చాలా ఆలస్యంగా సోషల్ మీడియాలోకి వచ్చింది. అందులో కేరళ ముఖ్యమంత్రి.. కర్ణాటక ముఖ్యమంత్రి.. రాహుల్ గాంధీ.. సోనియాగాంధీ.. ప్రియాంక గాంధీ.. మల్లికార్జున కార్గే వంటి వారు ఉన్నారు. వారందరూ కలిసి గ్రూప్ ఫోటో దిగారు. గ్రూప్ ఫోటోలో రేవంత్ రెడ్డి మాత్రమే తన స్వాగ్ చూపించారు. కాలు మీద కాలు వేసుకుని కే జి ఎఫ్ ఎలివేషన్ ను కళ్ళ ముందు కనిపించేలా చేశారు.రేవంత్ రెడ్డి మొదట్లో కాస్త అధిష్టానం వైఖరి వల్ల ఇబ్బంది పడ్డారు. అధిష్టానం కూడా ఆయనను ఇబ్బంది పెట్టింది. కొన్ని విషయాలలో రేవంత్ రెడ్డి మాట చెల్లుబాటు కాలేదు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో గులాబీ పార్టీ తీవ్రస్థాయిలో రేవంత్ రెడ్డి మీద వ్యతిరేక కథనాలను ప్రసారం చేసింది. సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా కామెంట్లు పెట్టింది. ఆ తర్వాత రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని తన దారికి తెచ్చుకున్నారు. కేరళలో ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించారు. కర్ణాటక రాష్ట్రంలో ప్రభుత్వ పెద్దలను కలిసి రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించుకునేలా చేశారు.

మహారాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడారు. ఒకరకంగా నేషనల్ పాలిటిక్స్ లో రేవంత్ రెడ్డి ఎక్స్పోజ్ అవుతున్నారు. మరోసారి తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత నేషనల్ పాలిటిక్స్ లోకి వెళ్లి పోతానని ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. దీనికి తగ్గట్టుగానే రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు.

ఇటీవల అస్సాంలో ఓ పత్రిక నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. తన రాజకీయ వ్యవహారాలను బయటపెట్టారు.ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్నికల నిబంధనలను మొహమాటం లేకుండా వ్యతిరేకించారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే తన లక్ష్యమని ప్రకటించారు. అంతేకాదు నరేంద్ర మోడీ పరిపాలన విధానాన్ని బ్రిటిష్ పరిపాలన విధానంతో పోల్చి విమర్శించారు.

తద్వారా రేవంత్ రెడ్డి బిజెపితో యుద్ధమే అన్నట్టుగా సంకేతాలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ పార్టీ.. బిజెపి దోస్తీ వ్యవహారం సాగుతోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కాలు మీద కాలు వేసుకుని కూర్చున్న ఫోటోను ఆయన అభిమానులు సోషల్ మీడియాలో విపరీతంగా సర్కులేట్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మీద రేవంత్ రెడ్డికి పట్టు పెరిగిపోయిందని.. ఇక ఆయనకు ఢోకా లేదని కామెంట్లు చేస్తున్నారు.

# 5వ తరగతి విద్యార్థులపై బెత్తం దెబ్బలు.. టీచర్ సస్పెన్షన్



వరంగల్ నెక్కొండ: తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు)లో 5వ తరగతి విద్యార్థులపై ఇంగ్లీష్ టీచర్ బెత్తంతో దాడి చేసిన ఘటన కలకలం రేపింది.విద్యార్థులను ఉపాధ్యాయురాలు రజిని బెత్తంతో కొట్టినట్లు సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద సుమోటోగా స్పందించారు. ఘటనపై ప్రాథమిక విచారణ చేపట్టేందుకు ఎంపీడీవోను నియమించారు.విచారణ అనంతరం సమర్పించిన నివేదిక ఆధారంగా ఇంగ్లీష్ టీచర్ రజినిని సస్పెండ్ చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు.విద్యార్థులపై ఎలాంటి వేధింపులు, శారీరక దాడులను సహించేది లేదని కలెక్టర్ సత్యశారద స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# సి ఆర్ డి ఏ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో మంత్రి నారాయణ సమీక్ష




అమరావతి మంత్రి నారాయణ బుధవారం నాడు సి ఆర్ డి ఏ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ కార్తీక్, ఇతర అధికారులు హజరయ్యారు. రాజధానిలో జరుగుతున్న ల్యాండ్ పూలింగ్ ప్రక్రియపై చర్చ జరిగింది. ల్యాండ్ పూలింగ్ కు నోటిపై చేసిన భూములు ఇంకా ఎంత సమీకరించాల్సి ఉంది...క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. రాజధాని లో జరుగుతున్న రోడ్లు, ఇతర నిర్మాణాలకు ఇంకా ఎంత మేర ల్యాండ్ పూలింగ్ చేయాల్సి ఉందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి ల్యాండ్ పూలింగ్ కు ఒప్పించాలని సూచించారు. రైతులు లేవనెత్తుతున్న సందేహాలను నివృత్తి చేసి పూలింగ్ కు సహకరించాలా చూడాలని కోరారు.

# విద్యుత్ కోతలపై రైతులు ఆగ్రహం .. మూసాపేట సబ్ స్టేషన్ ముట్టడి



మెదక్ : విద్యుత్ కోతలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్రీఫేస్ కరెంటు సక్రమంగా రావడం లేదని ఆరోపిస్తూ మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం మూసాపేట విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట రుస్తుంపేట, మూసాపేట, నాగులపల్లి తాండవాసులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయానికి కరెంటు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి త్రీఫేస్ కరెంటు ఇవ్వకపోవడంతో మోటర్లు నడవడం లేదని లో వోల్టేజితో బోర్ మోటార్ కాలిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కరెంటు సక్రమంగా చేయకపోతే సబ్ స్టేషన్ ను ముట్టడిస్తామని రైతులు హెచ్చరించారు.

# ప్రధాని మోడీకి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిసారు. భారత దేశానికి సరైన సమయంలో సరైన నేతగా మోదీ ఉన్నారని పేర్కొన్నారు. ప్రదాని మోదీ విజన్ తో వికసిత్ భారత్ ఏ 2047 దిశగా దేశం వేగంగా పయనిస్తోందని స్పష్టం చేసారు. సుదీర్ఘ ప్రజా సేవలో భాగమైన ప్రధాని మోదీ తో కలిసి పనిచేయడం గర్వకారణం అన్నారు. కేంద్రంలోను ఏపీలోను డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ల తో అభివృద్ధి, పెట్టుబడులు సరికొత్త వేగం అందుకున్నాయని స్పష్టం చేసారు. ప్రధాని సహకారంతో మౌలిక సదుపాయాలు, అవకాశాల కల్పనతో ఏపీ ముందుకు సాగుతోందని వెల్లడించారు. ప్రధాని మోదీనేతృత్వంలో దృఢమైన భారత్ తో పాటు సుసంపన్నమైన స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా శ్రమిస్తున్నాం. ప్రధానిగా నరేంద్ర మోదీ మరిన్ని విజయాలను అందుకుని దేశాన్ని ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు.

# ఏడుపాయలలో ఈనెల 11 నుండి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



పాపన్నపేట, అక్టోబర్ 7 రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మెదక్ జిల్లా పాపన్నపేటలోని ఏడుపాయల వనదుర్గ భవాని మాత సన్నిధిలో ఈనెల 11 నుండి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించను న్నట్లు ఆలయ చైర్మన్ వీరేశం తెలిపారు. ఈనెల 11న బాల త్రిపుర సుందరి దేవిగా, 12న గాయత్రీ దేవిగా, 13న అన్నపూర్ణాదేవి, 14న మహా చండి, 15 మహాలక్ష్మి, 16 సరస్వతి దేవి, 17న లలిత త్రిపుర సుందరి దేవిగా, 18న దుర్గాదేవి, 19 న మహిషాసుర మర్దిని, 20 శ్రీ రాజరాజేశ్వరి దేవి రూపంలో దర్శనం ఇవ్వనట్లు ఆయన వెల్లడించారు. ఈనెల 15న అమ్మవారికి బోనాలు తీసే కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

# మరోసారి తన మంచి మనసు చాటుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**మూగ, చెవిటి దంపతుల బిడ్డకు**
**వైద్య చికిత్స కోసం రూ.2 లక్షల ఆర్థిక సాయం**
**"బిడ్డకు మెరుగైన వైద్యం అందించేందుకు నేను అండగా ఉంటా.. ఏ సహాయం కావాలన్నా చేస్తా" అంటూ బాధిత కుటుంబానికి భరోసానిచ్చిన మంత్రి**

హైదరాబాద్ :రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. కష్టాల్లో ఉన్న ఓ కుటుంబానికి అండగా నిలిచి, అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి వైద్య చికిత్స అందించేందుకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు.ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన పనిగిరి గ్రామ నివాసులు జంపాల మహేష్ కుమార్, రజిత దంపతులు ఇద్దరూ మూగ, చెవిటి వారు. వారికి జన్మించిన బిడ్డ కూడా మూగ, చెవిటి తనంతో పుట్టడంతో ఆ తల్లిదండ్రుల జీవితాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తమ బిడ్డకు సరైన వైద్యం అందిస్తే మాట్లాడే అవకాశం ఉందని వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబంలో కొంత ఆశ చిగురించింది. అయితే, ఇందుకు లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ దంపతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ని ఆశ్రయించారు.వారి పరిస్థితిని తెలుసుకున్న మంత్రి ఎంతో ఆప్యాయతతో స్పందించారు. చిన్నారిని స్వయంగా ఎత్తుకుని అక్కున చేర్చుకుని, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. చిన్నారి వైద్య చికిత్స కోసం రూ.2 లక్షల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు.అంతేకాకుండా, చిన్నారికి మెరుగైన వైద్యం అందించే విషయంలో వైద్యులతో స్వయంగా మాట్లాడుతానని మంత్రి హామీ ఇచ్చారు. "మీ బిడ్డ విషయంలో ఆందోళన చెందవద్దు. ఏ సహాయం కావాలన్నా నేను అండగా ఉంటాను" అంటూ ఆ దంపతులకు భరోసా కల్పించారు.

## హైదరాబాద్ - శ్రీశైలం హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం
## బైకర్ మృతి, రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ గా గుర్తింపు

హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ పై వెళుతున్న వ్యక్తిని టాటా ఏసీ వాహనం ఢీకొట్టి బోల్తా కొట్టింది. ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పహాడీశరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్దార్ నగర్ గేట్ వద్ద హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది . ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని చనిమిల్ల కృషగా గుర్తించారు. మృతుడు కృష్ణ ఆర్టిసి రిటైర్డ్ డ్రైవర్గా ప్రస్తుతం ప్రైవేట్ బస్సు నడుపుతున్నట్లు తెలుస్తుంది . మృతుడు సర్దార్ నగర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రమాదానికి కారణమైన టాటా ఏసీ ఆటోలో కొందరు ఆవులను తరలిస్తున్నట్లు స్థానికులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## హైదరాబాద్‌లో డి.ఈ. షా ఇండియా 30 ఏళ్ల ప్రస్థానం

హైదరాబాద్‌లో డి.ఈ. షా ఇండియా 30 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా గ్రావా బిజినెస్ పార్క్‌లో 2027లో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రకటించింది. 6 లక్షల చదరపు అడుగులకు పైగా విస్తీర్ణంలో ఈ కార్యాలయం ఏర్పాటు కానుంది. జూబ్లీహిల్స్‌లో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు.

# విజయవాడలో పండుగల సందడి..

**సరస్ మేళా, దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్‌తో నగరానికి కొత్త శోభ**
**దేశం నలుమూలల నుంచి వచ్చే అతిథులకు విజయవాడ ఆతిథ్యం అందిద్దాం: ఎంపీ కేశినేని చిన్ని**



విజయవాడ: రానున్న పది రోజుల్లో విజయవాడ నగరం పండుగల వేదికగా మారనుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరస్ మేళా, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్?2.0 ఒకే సమయంలో జరగడం విజయవాడ ప్రజలకు ఎంతో ప్రత్యేకమైన సందర్భమని తెలిపారు.బుధవారం విజయవాడలోని ఆయన కార్యాలయం లో మీడియాతో మాట్లాడిన ఎంపీ చిన్ని.. సరస్ మేళా, దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.దేశ రాజధాని ఢిల్లీ తర్వాత విజయవాడలో సరస్ మేళా నిర్వహించడం గర్వకారణమని ఎంపీ అన్నారు. ఈ నెల 13 నుంచి 30వ తేదీ వరకు పున్నమి ఘాట్‌లోని సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో సరస్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీన భారత రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు.దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో సుమారు 650 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని, దాదాపు 2,500 మంది ప్రతినిధులు సరస్ మేళాలో పాల్గొననున్నారని వివరించారు. స్టాళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పున్నమి ఘాట్‌లో ఒకవైపు సరస్ మేళా, మరోవైపు విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నగరానికి మరింత ప్రత్యేక ఆకర్షణ ఏర్పడుతుందని ఎంపీ పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల సంప్రదాయ ఆహారాలను పరిచయం చేసే ఫుడ్ ఫెస్టివల్ కూడా సరస్ మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని చెప్పారు."ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనకు సరస్ మేళా స్ఫూర్తినిస్తుంది. మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు ఇది చక్కటి వేదిక. ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలు, కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సరస్ మేళా సాగుతుంది" అని ఎంపీ చిన్ని అన్నారు.దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్ ఒకే సమయంలో జరగడం విజయవాడ ప్రజలకు మూడు పండుగలు ఒకేసారి వచ్చినట్లేనని ఆయన అన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ప్రముఖులు విజయవాడకు రానున్నారని, పలువురు ప్రముఖులకు ఇప్పటికే ఆహ్వానాలు అందించామని చెప్పారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల పర్యటనల షెడ్యూల్ ఖరారు కావాల్సి ఉందన్నారు.తిరుమలకు దేశవ్యాప్తంగా ప్రముఖులు తరలివెళ్లడం ద్వారా ఆధ్యాత్మిక ప్రాధాన్యత మరింత పెరిగినట్లే, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం కోసం దేశంలోని ప్రముఖులు రావడం ద్వారా విజయవాడ ప్రత్యేకత దేశవ్యాప్తంగా మరింతగా చాటిచెప్పే అవకాశం లభిస్తుందని ఎంపీ తెలిపారు.ప్రముఖుల పర్యటనల సమయంలో భద్రతా కారణాల వల్ల ప్రజలకు కొంత ఇబ్బంది కలగవచ్చని, ప్రజలు, మీడియా సహకరించాలని కోరారు. విజయవాడకు వచ్చే ప్రతి అతిథికి ఆతిథ్యం ఇచ్చేలా నగరంలోని ప్రతి ఇల్లు, ప్రతి వ్యాపార సంస్థను అందంగా అలంకరించుకోవాలని నగర ప్రజలకు పిలుపునిచ్చారు.విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పిల్లలు, యువత కోసం వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని ఎంపీ తెలిపారు. తల్లిదండ్రుల సమక్షంలో సుమారు 50కి పైగా విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజయవాడలోని స్థానిక ప్రతిభను వెలికితీయడమే లక్ష్యమన్నారు.విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా లైవ్ కబడ్డీ, వాలీబాల్ పోటీలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా విజయవాడలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్?కర్ణాటక రంజీ మ్యాచ్‌కు అంతర్జాతీయ స్థాయి క్రికెటర్లు, ప్రముఖులు హాజరుకానుండటం నగరానికి మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు."సరస్ మేళా విజయవాడకు రావడం మనందరికీ గర్వకారణం. దసరా ఉత్సవాలు, సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్‌ను ప్రజలంతా కలిసి విజయవంతం చేయాలి. దేశం నలుమూలల నుంచి వచ్చే అతిథులకు విజయవాడ ఆతిథ్యాన్ని చాటిచెప్పాలి. ప్రజలు, మీడియా, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతున్నాను" అని ఎంపీ కేశినేని చిన్ని విజ్ఞప్తి చేశారు.

# ఓటు విలువను కాపాడే రాహుల్ పోరాటాన్ని బారికేడ్లు ఆపలేవు

**ఓటు చోరీ ఆరోపణలకు ఎన్నికల సంఘం బహిరంగ సమాధానాలు ఇవ్వాలి**
**ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన వారి ప్రశ్నలను అణచలేరు**
**ఎన్నికల పారదర్శకతపై దేశవ్యాప్త చర్చకు దారితీసిన రాహుల్ గాంధీకి అభినందనలు**

హైదరాబాద్, అక్టోబర్ 7 :"ప్రజల ఓటు విలువను కాపాడాలంటూ రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని పోలీసు బారికేడ్లతో ఆపలేరు. ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకున్నంత మాత్రాన వారు లేవనెత్తిన ప్రశ్నలు మాయమైపోవు. సమాధానం కోసం నిలబడిన గొంతును అడ్డుకుంటే, ఆ ప్రశ్న మరింత బలంగా దేశమంతటా ప్రతిధ్వనిస్తుంది," అని నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

ఎన్నికల పారదర్శకత కోసం దృఢంగా నిలబడి, ప్రతిపక్ష నిరసనకు నాయకత్వం వహించిన రాహుల్ గాంధీకి ఆయన అభినందనలు తెలిపారు.ఢిల్లీలో ఎన్నికల సంఘం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య జవాబుదారీతనంపై మరింత చర్చకు దారితీసిందని ఉత్తమ్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై వివరణ కోరుతున్న నాయకులను అడ్డుకున్న దృశ్యాలు ప్రజల దృష్టిని ఆకర్షించాయని అన్నారు. "బారికేడ్ల ఎత్తుతో ప్రజాస్వామ్య బలాన్ని కొలవలేరు. ప్రజల సందేహాలకు ఇచ్చే సమాధానాల స్పష్టతలోనే వ్యవస్థల బలం కనిపిస్తుంది," అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతలకు అనుగుణంగా పూర్తి నిష్పాక్షికతతో వ్యవహరించాలని మంత్రి స్పష్టం చేశారు. "రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠను నిలబెట్టేది అధికార దర్పం కాదు; ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నిర్ణయాల్లో పారదర్శకత, అభ్యంతరాల పరిశీలనలో నిజాయితీ, సమాధానాల్లో స్పష్టత ఉండాలి. సంస్థను ప్రశ్నించడం దాని ప్రతిష్ఠను దెబ్బతీయడమంటూ భావించే ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం," అని అన్నారు.ఓటర్ల జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను రాజకీయ విమర్శలంటూ కొట్టిపారేయడం సరికాదని ఉత్తమ్ పేర్కొన్నారు.

"అర్హుడైన ఒక్క పౌరుడి పేరు అన్యాయంగా తొలగినా, అది ఆ వ్యక్తి హక్కుకు జరిగిన నష్టం. అలాంటి అభ్యంతరాన్ని చిన్న విషయంగా తీసుకునే అవకాశం ఎవరికీ లేదు. జాబితాల సవరణకు అనుసరించిన ప్రమాణాలు, పేర్ల తొలగింపునకు కారణాలు, అభ్యంతరాల పరిష్కార విధానం ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. ఆధారాలతో లేవనెత్తిన ఆరోపణలను నిష్పాక్షికంగా పరిశీలించి, ఆ పరిశీలన ఫలితాలను బహిరంగంగా వెల్లడించాలి," అని డిమాండ్ చేశారు.ఓటు చోరీ ఆరోపణలను దేశవ్యాప్త చర్చలోకి తీసుకురావడంలో రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. "సామాన్యుడి చేతిలోని ఓటు అతడి ఆత్మగౌరవానికి ముద్ర. పాలకులను ఎన్నుకునే అతడి స్వేచ్ఛకు ఆయుధం. ఆ ఓటుపై అనుమానపు నీడ పడితే ప్రజాస్వామ్య పునాదులే దెబ్బతింటాయి." ప్రతి ఓటుకూ విలువ ఉండాలని, ప్రతి అర్హుడూ తన ఓటు హక్కును వినియోగించుకోవాలని రాహుల్ గాంధీ పట్టుబడుతున్నారని పేర్కొన్నారు.

ఈ లక్ష్యంతో ఆయన చేస్తున్న పోరాటం దేశ ప్రజలందరికీ సంబంధించినదని స్పష్టం చేశారు.అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే హక్కు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఉందని ఉత్తమ్ అన్నారు. "ప్రతిపక్షం లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత నుంచి పాలకులు తప్పించుకోలేరు. విమర్శలను అవహేళన చేయడం, ప్రశ్నించే వారిపై రాజకీయ దాడులకు దిగడం ద్వారా సందేహాలు తొలగవు. ప్రజల తీర్పుతో ఏర్పడే ప్రభుత్వాల విశ్వసనీయతను కాపాడాలంటే, ఆ తీర్పు వెలువడే ఎన్నికల ప్రక్రియపై పూర్తి నమ్మకం ఉండాలి," అని పేర్కొన్నారు.ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలపై పట్టుదలగా ప్రశ్నించడం రాహుల్ గాంధీ నాయకత్వంలో కనిపించే లక్షణమని మంత్రి అన్నారు. 2016లో పెద్ద నోట్ల రద్దుతో పేదలు, చిన్న వ్యాపారులు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారని గుర్తుచేశారు. 2020 మార్చిలో కోవిడ్ కారణంగా పొంచి ఉన్న తీవ్రమైన ఆర్థిక దెబ్బపై హెచ్చరించారని, లడఖ్ సరిహద్దు పరిణామాలపై దేశానికి స్పష్టత ఇవ్వాలని పదేపదే కోరారని అన్నారు. ప్రజల ఆందోళనలను అధికార వ్యవస్థల ముందుంచడంలో ఆయన చూపిన పట్టుదల ఇప్పుడు ఎన్నికల పారదర్శకత పోరాటంలోనూ కనిపిస్తోందని పేర్కొన్నారు.

# వికసిత్ భారత్ సేవా జ్యోతి యాత్రలో పాల్గొన్న బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి

కడప నగరంలో వికసిత్ భారత్ సేవా జ్యోతి యాత్ర కార్యక్రమం జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో అతిథిగా జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన వికసిత్ భారత్ సేవ జ్యోతి యాత్ర క్రమంలో పాల్గొని ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు అనంతరం జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ ఇచ్చే పిలుపుమేరకు ప్రతి కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా అందరూ కలిసి విజయవంతం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ చిట్టిబాబు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మన సుబ్బారాయుడు, బద్వేల్ ఏఎంసీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ, అసెంబ్లీ కో-కన్వీనర్ పల్లంసెట్టి పండారి, పోరుమామిళ్ల బీజేపీ అధ్యక్షులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఓట్, సీట్ చోరీ పేటెంట్స్ కాంగ్రెస్ వే: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్







కరీంనగర్ ఓట్ చోరీ, సీట్ చోరీ పేటెంట్ రైట్స్ కాంగ్రెస్ కే ఉన్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దేశంలో మొట్టమొదటి ఓట్, సీట్ చోరీకి పాల్పడిన ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని చెప్పారు. 1946లో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బ్రిటీష్ పాలకులు కాంగ్రెస్ కోరిన సమయంలో దేశంలోని ప్రదేశ కాంగ్రెస్ కమిటీలన్నీ తొలి ప్రధాని అభ్యర్థిగా పటేల్ పేరు ప్రతిపాదిస్తూ ఓట్లేస్తే ఒక్క పీసీసీ మద్దతు కూడా నెహ్రూను ప్రధాని చేసిన ఘనత కాంగ్రెస్ దేనని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీకి ఓట్, సీట్ చోరీకి పాల్పడాల్సిన కర్మ లేనేలేదన్నారు. ఆయనకు కుటంబమే లేదని, బ్యాంకు బ్యాలెన్స్, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు అవసరమే లేదన్నారు. ప్రధాని పదవి నుండి దిగిపోయిన వెంటనే జబ్బకు సంచి తగిలించుకుని సామాన్యుడిలా ప్రజా సేవలో తరించే మహనీయుడు మోదీ అని అభివర్ణించారు. మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా నుండి హౌజింగ్ బోర్డు కాలనీ పదవ చౌరస్తా వరకు 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప సభకు భారీ ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, బీజేపీ జాతీ అధ్యక్షుడు నితిన్ నబిన్ వర్చువల్ గా ప్రసగించి కార్యకర్తలను ఉత్తేజ పరిచారు. ఈ కార్యక్రమం అనంతరం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి శాంతి కుమార్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు.

:దేశం కోసం, ప్రజల కోసం 25 ఏళ్ల ప్రజా సేవను గుర్తుగా సేవా జ్యోతి నిర్వహించాం. మోదీ దేశానికి చిరకాలం సేవలందించాలని ప్రజలంతా కోరుకుంటున్నారు. ప్రతి పేదింట్లో వెలుగులు నింపడం ద్వారా దేశాభివృద్ధి సాధించేలా మోదీ శ్రమిస్తున్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ నిర్విరామంగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ సహా కొన్ని రాజకీయ మాటలు విని మోసపోయిన యువకులకు నా విజ&ఞప్తి.మోదీ రాజకీయ నేపథ్యం, చరిత్ర, ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకోండి. మోదీ లేని భారత్ ను ఊహించలేం. స్వార్థం వీడి దేశం కోసం ఆలోచించండి. 2014కు ముందు నేడు భారత్ ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో ఆత్మ విమర్శ చేసుకోండి.మోదీకి సొంత కుటుంబం లేదు దేశ ప్రజలే ఆయన కుటుంబం. ఆయనకు డబ్బులు, బినామీ ప్రాపర్టీలు అవసరమే లేదు. దేశ సేవే ఆయన లక్ష్యం. ప్రధాని పదవి నుండి దిగిపోయినా జబ్బకు సంచి వేసుకుని ప్రజాసేవలో తరించే మహనీయుడు మోదీ. మోదీకి ఆయురారోగ్యాలు అందించాలని సేవా జ్యోతి నిర్వహించాం.

# పరిశుభ్రతే కీలకం - ప్రొఫెసర్ లిల్లీ



హైదరాబాద్: పరిసరాల అపరిశుభ్రతతో పాటు స్వీయ జాగ్రత్తలు పాటించకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీనితో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలు ప్రగులుతున్నాయి. రాష్ట్రంలోని మునిసిపల్ వార్డుల్లో, గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మురుగు కాలువలు, నీరు నిలిచిన ప్రదేశాలలో దోమల నిర్మూలనకు చర్యలు ప్రభుత్వం చేయబడుతుంది అని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు.

ఇంటి పరిసరాలలోనే...

ఈ దోమ ఇంటి పరిసర ప్రాంతాల్లోనే ఉంటుంది. ఎయిర్ కూలర్ లలో ఉండే నీటిలో, ఫ్లవర్ వాజులు, అక్వేరియం వద్ద డెంగ్యూ కారక దోమ సంచరిస్తుందని లిల్లీ మేరీ తెలిపారు. నిలిచిన నీరు, నీటిమడుగులు, ఫ్లవర్ వాజులు. టైర్లు, మూతలు లేని ట్యాంకుల్లో ఈ దోమ తమ స్థావరాలను ఏర్పాటు చేసుకుంటుంది. ఈ దోమ కుట్టిన వారిలో క్లాసికల్ డెంగి, డెంగీ హేమరేజ్ ఫీవర్, డెంగీ షాక్ సిండ్రోమ్ జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని ఆమె తెలిపారు. వైరల్ ఫీవర్ లో ఉండే లక్షణాలు ఆధారంగా క్లాసికల్ డెంగీ ఫీవర్ గా పరిగణిస్తారు. ఇది ఐదు నుంచి ఏడు రోజులు ఉంటుంది. మందుతో దీనిని తగ్గించడానికి అవకాశం ఉంది. డెంగీ హేమరేజ్ ఫీవర్ దశలో రక్తంలో పరిమాణం తగ్గిపోవడం, బీపీ పడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ దశలో రోగిని ఇంటెన్సీవ్ కేర్ లోఉంచి చికిత్సలు అందిస్తారు. డెంగీ షాక్ సిండ్రోమ్ దశ చాలా తీవ్ర దశ. ఈరోగి ఈ దశకు చేరుకోగాన్ని ఇంటెన్సీవ్ చికిత్స తో పాటు ప్లాస్మా ఎక్కించాల్సిన అవసరం ఉంటుంది. ఈ దశలో నీరు ఊపిరితిత్తుల్లోకి చేరే ప్రమాదం ఉంది. రోగికి కృత్రిమ శ్వాస ఇచ్చి ప్రాణాపాయము నుండి రక్షించాల్సిన పరిస్థితి ఉంటుందని ప్రొఫెసర్ లిల్లీ మేరి అన్నారు.

అటెన్షన్ ప్లీజ్

డెంగీ బాధితులు లో-బీపీ బారిన పడకుండా జాగ్రత్త పడాలి. బీపీ తగ్గితే... మూత్రపిండాలు, కాలేయము పనితీరు మందగిస్తుంది. బీపీతో పాటు రక్తస్రావం అధికంగా ఉంటే వెంటనే ప్లేట్లెట్స్ ఎక్కించాలి. రక్తస్రావం అధికంగా అవుతుంటే ప్లేట్లెట్స్ సంఖ్యతో సంబంధం లేకుండా రక్తం ఇవ్వడం మంచిది. డెంగీ రోగికి ఎక్కువగా ఫ్లూయిడ్స్ ఇస్తుండాలి అని ప్రొఫెసర్ లిల్లీ మేరి పేర్కొన్నారు.

డెంగీ కి దూరంగా ఇలా...

పగలు దోమ కొట్టదనే భావన వద్దు. శరీరం పూర్తిగా కవర్ అయ్యే కాటన్ దుస్తులు ధరించాలి. మస్కిటో రిఫిలెంట్స్ వినియోగించాలి. కిచెన్ లో అన్నము, కూరలు, చెత్తను ఓపెన్ గా పెట్టవద్దు. కాల,నీ ఇళ్లలో నిల్వ ఉండే నీటి గుంతలను పూడ్చాలని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు.

లక్షణాలు

సాధారణ జ్వరంతో మొదలై శరీరంలోని ఉష్ణోగ్రత అధికంగా ఉండి నాలుగైదు రోజులపాటు జ్వరంతో ఇబ్బంది పడతారని, తలనొప్పి, చలి, వణుకు, అపరిమితమైన చమట, ఒళ్ళు నొప్పులు, నోరు చేదు కావడం, నీరసం, జలుబు, శరీరం వేడిగా మారటం వంటి లక్షణాలు ఉంటే డెంగీగా అనుమానించాలని ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు.

పగటిపూట దోమతోనే తంటా...

డెంగీ వ్యాధితో బాధపడుతున్న వారిని కొట్టిన దోమలో వ్యాధికారకం ప్రవేశించడంతో అది మరొకరిని కొడితే వారికి డెంగీ వస్తుందని ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు. బాధితుడికి డెంగీ నిర్ధారణ అయ్యే లోపుగా ఆ దోమ పదిమందిని కుట్టి వ్యాధిని వ్యాపింప చేస్తుంది ఈ దోమ రాత్రిపూట కుట్టదని కేవలం పగటిపూట మాత్రమే కుడుతుందని అని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు లిల్లీ మేరి అన్నారు.

లివైరల్ జ్వరాల నియంత్రణకు

పరిశుభ్రతే కీలకంలి

ప్రొఫెసర్ లిల్లీ మేరి

హైదరాబాద్ అక్టోబర్ 7:: పరిసరాల అపరిశుభ్రతతో పాటు స్వీయ జాగ్రత్తలు పాటించకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీనితో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలు ప్రగులుతున్నాయి. రాష్ట్రంలోని మునిసిపల్ వార్డుల్లో, గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మురుగు కాలువలు, నీరు నిలిచిన ప్రదేశాలలో దోమల నిర్మూలనకు చర్యలు ప్రభుత్వం చేయబడుతుంది అని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు.

ఇంటి పరిసరాలలోనే...

ఈ దోమ ఇంటి పరిసర ప్రాంతాల్లోనే ఉంటుంది. ఎయిర్ కూలర్ లలో ఉండే నీటిలో, ఫ్లవర్ వాజులు, అక్వేరియం వద్ద డెంగ్యూ కారక దోమ సంచరిస్తుందని లిల్లీ మేరీ తెలిపారు. నిలిచిన నీరు, నీటిమడుగులు, ఫ్లవర్ వాజులు. టైర్లు, మూతలు లేని ట్యాంకుల్లో ఈ దోమ తమ స్థావరాలను ఏర్పాటు చేసుకుంటుంది. ఈ దోమ కుట్టిన వారిలో క్లాసికల్ డెంగి, డెంగీ హేమరేజ్ ఫీవర్, డెంగీ షాక్ సిండ్రోమ్ జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని ఆమె తెలిపారు. వైరల్ ఫీవర్ లో ఉండే లక్షణాలు ఆధారంగా క్లాసికల్ డెంగీ ఫీవర్ గా పరిగణిస్తారు. ఇది ఐదు నుంచి ఏడు రోజులు ఉంటుంది. మందుతో దీనిని తగ్గించడానికి అవకాశం ఉంది. డెంగీ హేమరేజ్ ఫీవర్ దశలో రక్తంలో పరిమాణం తగ్గిపోవడం, బీపీ పడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ దశలో రోగిని ఇంటెన్సీవ్ కేర్ లోఉంచి చికిత్సలు అందిస్తారు. డెంగీ షాక్ సిండ్రోమ్ దశ చాలా తీవ్ర దశ. ఈరోగి ఈ దశకు చేరుకోగాన్ని ఇంటెన్సీవ్ చికిత్స తో పాటు ప్లాస్మా ఎక్కించాల్సిన అవసరం ఉంటుంది. ఈ దశలో నీరు ఊపిరితిత్తుల్లోకి చేరే ప్రమాదం ఉంది. రోగికి కృత్రిమ శ్వాస ఇచ్చి ప్రాణాపాయము నుండి రక్షించాల్సిన పరిస్థితి ఉంటుందని ప్రొఫెసర్ లిల్లీ మేరి అన్నారు.

అటెన్షన్ ప్లీజ్

డెంగీ బాధితులు లో-బీపీ బారిన పడకుండా జాగ్రత్త పడాలి. బీపీ తగ్గితే... మూత్రపిండాలు, కాలేయము పనితీరు మందగిస్తుంది. బీపీతో పాటు రక్తస్రావం అధికంగా ఉంటే వెంటనే ప్లేట్లెట్స్ ఎక్కించాలి. రక్తస్రావం అధికంగా అవుతుంటే ప్లేట్లెట్స్ సంఖ్యతో సంబంధం లేకుండా రక్తం ఇవ్వడం మంచిది. డెంగీ రోగికి ఎక్కువగా ఫ్లూయిడ్స్ ఇస్తుండాలి అని ప్రొఫెసర్ లిల్లీ మేరి పేర్కొన్నారు.

డెంగీ కి దూరంగా ఇలా...

పగలు దోమ కొట్టదనే భావన వద్దు. శరీరం పూర్తిగా కవర్ అయ్యే కాటన్ దుస్తులు ధరించాలి. మస్కిటో రిఫిలెంట్స్ వినియోగించాలి. కిచెన్ లో అన్నము, కూరలు, చెత్తను ఓపెన్ గా పెట్టవద్దు. కాల,నీ ఇళ్లలో నిల్వ ఉండే నీటి గుంతలను పూడ్చాలని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు.

లక్షణాలు

సాధారణ జ్వరంతో మొదలై శరీరంలోని ఉష్ణోగ్రత అధికంగా ఉండి నాలుగైదు రోజులపాటు జ్వరంతో ఇబ్బంది పడతారని, తలనొప్పి, చలి, వణుకు, అపరిమితమైన చమట, ఒళ్ళు నొప్పులు, నోరు చేదు కావడం, నీరసం, జలుబు, శరీరం వేడిగా మారటం వంటి లక్షణాలు ఉంటే డెంగీగా అనుమానించాలని ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు.

పగటిపూట దోమతోనే తంటా...

డెంగీ వ్యాధితో బాధపడుతున్న వారిని కొట్టిన దోమలో వ్యాధికారకం ప్రవేశించడంతో అది మరొకరిని కొడితే వారికి డెంగీ వస్తుందని ప్రొఫెసర్ లిల్లీ మేరి తెలిపారు. బాధితుడికి డెంగీ నిర్ధారణ అయ్యే లోపుగా ఆ దోమ పదిమందిని కుట్టి వ్యాధిని వ్యాపింప చేస్తుంది ఈ దోమ రాత్రిపూట కుట్టదని కేవలం పగటిపూట మాత్రమే కుడుతుందని అని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు లిల్లీ మేరి అన్నారు.

# బియ్యం ధరలు ఉడుకుతున్నాయి.

## (హెచ్.ప్రతాప్)

మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుగా తయారైంది సామాన్యుడి పరిస్థితి. ఇప్పటికే పప్పులు, నూనెలు, ఉప్పు వంటి నిత్యావసరాల ధరలు భారం మోపుతుండగా.. ఇప్పుడు బియ్యం ధరలు కూడా షాకిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు కిలో రూ.45 నుంచి రూ.50 మధ్య ఉన్న సన్న బియ్యం ధరలు ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90 వరకు చేరడం వంటింటి బడ్జెట్‌ను బెంబేలెత్తిస్తోంది. తెలంగాణలో సన్నాల సాగు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ బియ్యం ధరలు మాత్రం తగ్గకపోవడం వినియోగదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. అసలు ఈ ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? ఇది సహజమైన పెరుగుదలా? వ్యాపారుల నిల్వల ప్రభావమా? ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావమా? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

రెండేళ్లలోనే భారీగా పెరిగిన ధరలు

మరీ ముఖ్యంగా గత రెండు నెలల్లో బియ్యం ధరలు ఒక్కసారిగా పెరగడం సామాన్యులను షాక్‌కు గురిచేస్తోంది. గత ఏడాది గరిష్టంగా కిలో రూ.60 వరకు ఉన్న బియ్యం ధర ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90కు చేరింది. గత కొన్నేళ్ల ధరలను పరిశీలిస్తే.. 2020లో కిలో బియ్యం రూ.35 నుంచి రూ.42, 2021లో రూ.38 నుంచి రూ.44, 2022లో రూ.40 నుంచి రూ.46, 2023లో రూ.42 నుంచి రూ.50, 2024లో రూ.45 నుంచి రూ.55, 2025లో రూ.50 నుంచి రూ.70 వరకు పలికింది. అయితే 2026లో మాత్రం కిలో ధర ఏకంగా రూ.80 నుంచి రూ.90కు చేరింది. అంటే గతంలో ఏడాదికి రూ.5 నుంచి రూ.10 వరకు పెరుగుతూ వచ్చిన ధర.. ఈ ఏడాది ఏకంగా రూ.20 నుంచి రూ.25 వరకు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

ఎల్‌నినో ప్రభావం.. ముందస్తు నిల్వలే కారణమా?

బియ్యం ధరల పెరుగుదలకు వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం కూడా ఒక కారణంగా వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. రానున్న పంట దిగుబడిపై అనిశ్చితి ఉంటుందన్న అంచనాలతో హోల్‌సేల్ వ్యాపారులు, ప్యాకింగ్ కంపెనీలు సన్న బియ్యాన్ని ముందుగానే పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ముందస్తు కొనుగోళ్ల కారణంగా మార్కెట్‌లో లభ్యత తగ్గి ధరలు పెరుగుతున్నాయన్న వాదన వినిపిస్తోంది. మరోవైపు ప్రభుత్వ కస్టమ్ మిల్లింగ్ కింద సేకరించిన ధాన్యంలో అక్రమాలు జరగడం, నాణ్యమైన బియ్యం పక్కదారి పట్టడం వంటి అంశాలు కూడా మార్కెట్‌లో బియ్యం లభ్యతపై ప్రభావం చూపుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

తెలంగాణ సన్న బియ్యానికి ఇతర రాష్ట్రాల్లో భారీ డిమాండ్

తెలంగాణ సోనా, హెచ్‌ఎంటీ, బీపీటీ వంటి నాణ్యమైన సన్న రకాలకు ఇతర రాష్ట్రాల్లో భారీ డిమాండ్ ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు తెలంగాణలోని నల్లగొండ, నిజామాబాద్, ఖమ్మం వంటి జిల్లాలకు వచ్చి రైతుల నుంచి అధిక ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేసి ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు తరలిస్తున్నారనే వాదన ఉంది. దీంతో రాష్ట్రంలోని స్థానిక మార్కెట్లలో సన్న ధాన్యం లభ్యత తగ్గి, చివరకు బియ్యం ధరలపై ప్రభావం పడుతోందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ బోనస్‌తో ఓపెన్ మార్కెట్‌కు తగ్గిన సరఫరా?

తెలంగాణ ప్రభుత్వం సన్న ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తోంది. అలాగే పాఠశాలలు, రేషన్ షాపులకు సన్న బియ్యం సేకరిస్తోంది. దీంతో రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ఎక్కువగా విక్రయిస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం సానుకూల పరిణామమే అయినప్పటికీ.. ప్రైవేట్ మిల్లర్లు, ఓపెన్ మార్కెట్ వ్యాపారులకు అందుబాటులో ఉండే సన్న ధాన్యం పరిమాణం తగ్గుతోంది. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం ధర క్వింటాకు సుమారు రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

రవాణా, మిల్లింగ్, ప్యాకింగ్ ఖర్చుల భారం కూడా..

ధాన్యం ధర పెరగడంతో పాటు రవాణా, మిల్లింగ్, ప్యాకింగ్, విద్యుత్ వంటి ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. ఇవన్నీ కలిసివచ్చి చివరకు వినియోగదారుడిపై భారం పడుతోంది. కిలో బియ్యం రూ.80 నుంచి రూ.90 వరకు చేరడంతో నెలవారీ కుటుంబ బడ్జెట్‌లో బియ్యం కోసం కేటాయించాల్సిన మొత్తం గణనీయంగా పెరిగింది. పప్పులు, ఉప్పు వంటి ఇతర వస్తువుల ధరలు పెరిగితే కొంత మేర సర్దుబాటు చేసుకోవచ్చని.. కానీ బియ్యం ధర పెరిగితే మాత్రం తప్పనిసరిగా కొనాల్సిందేనని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం ధర సెంచరీ కొడుతుందా?

ప్రస్తుతం కిలో బియ్యం ధర రూ.80 నుంచి రూ.90 మధ్య ఉండటంతో.. ఇదే పరిస్థితి మరికొంతకాలం కొనసాగితే ధర రూ.100 మార్క్‌ను తాకే అవకాశాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. బియ్యం వంటి నిత్యావసర వస్తువు ధర సామాన్యులపై మరింత భారం పడకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని వినియోగదారులు కోరుతున్నారు. అక్రమ నిల్వలు, పక్కరాష్ట్రాలకు తరలింపులు, మార్కెట్‌లో కృత్రిమ కొరత వంటి అంశాలపై దృష్టి పెట్టడంతో పాటు ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. లిధర ఉడుకుతోంది.. బియ్యం రేటు సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను కాల్చేస్తోంది!లి

ఛాపిలొత్ సైడ్:

ధర ఉడుకుతోంది..! సామాన్యుడి వంటింటిపై బియ్యం భారం

(ప్రతాప్)

తెలంగాణలో బియ్యం ధరలు సామాన్య కుటుంబాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే పప్పులు, వంటనూనెలు, కూరగాయలు, గ్యాస్ ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఇప్పుడు బియ్యం ధరల పెరుగుదల మరో అదనపు భారంగా మారింది. కొద్ది నెలల క్రితం వరకు కిలో రూ.45 నుంచి రూ.50 మధ్య లభించిన సన్న బియ్యం ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90 వరకు చేరడం వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల్లో నెలవారీ బడ్జెట్ లెక్కలు పూర్తిగా మారిపోతున్నాయి.

గత కొన్నేళ్ల ధరల పరిస్థితిని పరిశీలిస్తే బియ్యం ధరల్లో క్రమంగా పెరుగుదల కనిపించినప్పటికీ, ఈ ఏడాది నమోదైన పెరుగుదల అసాధారణంగా ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. 2020లో కిలో సన్న బియ్యం ధర రూ.35 నుంచి రూ.42 మధ్య ఉండగా, 2023 నాటికి రూ.50 వద్దకు చేరింది. 2025లో రూ.70 వరకు పెరిగిన ధర, 2026లో రూ.80 నుంచి రూ.90 స్థాయికి చేరడం వినియోగదారుల ఆందోళనలను మరింత పెంచుతోంది. ధరల పెరుగుదల వెనుక ఒకటి కాదు, అనేక కారణాలు కలిసి పనిచేస్తున్నాయని వ్యాపార వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఎల్‌నినో ప్రభావం, వాతావరణ అనిశ్చితులు, రానున్న పంట దిగుబడులపై ఉన్న సందేహాలు మార్కెట్‌పై ప్రభావం చూపుతున్న ప్రధాన అంశాలుగా చెబుతున్నారు. భవిష్యత్తులో సరఫరా తగ్గే అవకాశం ఉందనే అంచనాలతో భారీ వ్యాపారులు, ప్యాకింగ్ సంస్థలు ముందుగానే పెద్ద మొత్తంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో బహిరంగ మార్కెట్‌లో లభ్యత తగ్గి ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఇక తెలంగాణలో పండే సోనా, హెచ్‌ఎంటీ, బీపీటీ వంటి నాణ్యమైన సన్న రకాల బియ్యానికి ఇతర రాష్ట్రాల్లో భారీ డిమాండ్ ఉండటం కూడా ధరల పెరుగుదలకు మరో కారణంగా మారింది. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు తెలంగాణ ధాన్యం పెద్ద మొత్తంలో తరలిపోతుండటంతో స్థానిక మార్కెట్లలో సరఫరా తగ్గుతోందని చెబుతున్నారు. అదనంగా ప్రభుత్వం సన్న ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు బోనస్ అందించడం, ప్రభుత్వ కొనుగోళ్లు పెరగడం వల్ల బహిరంగ మార్కెట్‌కు వచ్చే ధాన్యం పరిమాణం తగ్గినట్లు తెలుస్తోంది.

రవాణా ఖర్చులు, మిల్లింగ్ వ్యయాలు, ప్యాకింగ్ ఖర్చులు, విద్యుత్ చార్జీల పెరుగుదల కూడా తుది వినియోగదారుడిపై ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుత పరిస్థితి కొనసాగితే కిలో బియ్యం ధర త్వరలోనే రూ.100 మార్కును తాకే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అనవసర ధరల పెరుగుదలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు. ఎందుకంటే సామాన్యుడికి బియ్యం విలాస వస్తువు కాదు, నిత్యావసరం. దాని ధర పెరిగితే వంటింటి బడ్జెట్ మొత్తం తారుమారవుతుంది.

## ఎల్‌నినో ప్రభావం వల్ల కరెంట్ డిమాండ్ పెరిగింది: భట్టి

హైదరాబాద్ తెలంగాణ ఎల్‌నినో వల్ల కరెంట్ డిమాండ్ పెరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడు?. 19,892 మెగావాట్ల పీక్ డిమాండ్ ఉంది. ఎలాంటి ఇబ్బంది కట్స్ లేకుండా సప్లై చేస్తున్నాం. ఇబ్బందుల్లో కూడా జాగ్రత్తగా సిబ్బంది కరెంట్ అందిస్తున్నారు. సిబ్బందిని అభినందించాల్సింది పోయి కొందరు విమర్శిస్తున్నారు. రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ గురించి ఏదో మాట్లాడారు. యాదాద్రి పవర్ ప్లాంట్ డిపిఆర్ ఉందా కనీసం కోల్ లింకేజ్ ప్లాన్ చేశారా అని ప్రశ్నించారు.

## గ్యార్వీ షరీఫ్ ఫాతిహాలో పాల్గొన్న అహ్లే సున్నత్ వల్ జమాత్ అధ్యక్షులు

కొత్తగూడెం : గ్యార్వీ షరీఫ్ ఫాతిహా కార్యక్రమంలో అహ్లే సున్నత్ వల్ జమాత్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ముస్లింలందరి శాంతి, సౌభాగ్యం, భద్రత, అభివృద్ధి, క్షేమం కోసం దువా చేశారు. ఈ కార్యక్రమంలో సున్నత్ వల్ జమాత్ కమిటీ చైర్మన్ ఎం.డి. గౌస్ మొయినుద్దీన్, అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్, జనరల్ సెక్రటరీ ఎం.డి. హుస్సేన్ ఖాన్, వైస్ చైర్మన్ షేక్ అబ్దుల్ కరీం, వైస్ ప్రెసిడెంట్లు షేక్ యాకూబ్ ఖాద్రి, షేక్ షమ్మీఉద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్లు సయ్యద్ యూసుఫ్ ఖాద్రి, షఫీ ఖాద్రి, మహబూబ్ ఖాద్రి, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ నయీమ్ చిష్తితో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రోబోటిక్ సర్జరీ పేరిట హైదరాబాద్‌లో ఘరానా మోసం

**హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్**
**రోబోటిక్ సర్జరీ పేరుతో మోసం చేస్తున్నారంటూ ఫోర్టిస్ ఆసుపత్రిపై ఆరోపణలు**
**కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు దళిత విద్యార్థి సమైక్య డిమాండ్**
**లక్డీకపూల్ ఫోర్టిస్ హాస్పిటల్ లో రోబోటిక్ మెషిన్ లేదని**
**ఆసుపత్రి యాజమాన్యమే చెప్పిందని ఆరోపణ**
**గ్లోబల్ హాస్పిటల్‌కు చెందిన రోబోటిక్ మిషన్‌ను తనిఖీల సమయంలో తీసుకొచ్చి చూపించారని**
**వంశీ బాలెంల ఆరోపణ**



హైదరాబాద్: రోబోటిక్ సర్జరీ సాంకేతికత పేరుతో లక్డీకపూల్ లోని ఫోర్టిస్ ఆసుపత్రి రోగులను, ప్రజలను మోసం చేస్తోందని దళిత విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు వంశీ బాలెంల ఆరోపించారు. ఆసుపత్రి యాజమాన్యం, సంబంధిత వైద్యుడు డాక్టర్ రాకేష్ కొమురవెల్లి సోషల్ మీడియా వేదికగా ఫోర్టిస్‌లో రోబోటిక్ సర్జరీ సదుపాయం ఉన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు.

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వంశీ బాలెంల మాట్లాడుతూ.. దుగ్గి వెంకటలక్ష్మి అనే బాధితురాలు ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రకటనలను చూసి రోబోటిక్ ఆపరేషన్ కోసం ఫోర్టిస్ ఆసుపత్రిని సంప్రదించారని తెలిపారు. మొదట రోబోటిక్ ఆపరేషన్ చేస్తామని చెప్పి, అనంతరం కేవలం మందులు ఇచ్చి పంపించారని ఆయన ఆరోపించారు.

ఈ వ్యవహారంపై అనుమానం రావడంతో దళిత విద్యార్థి సమైక్య ప్రతినిధులు ఆసుపత్రి యాజమాన్యం, సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా, లకడీకాపూల్ ఫోర్టిస్ ఆసుపత్రిలో రోబోటిక్ మిషన్ లేదని వారు స్వయంగా చెప్పినట్లు వంశీ బాలెంల పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆసుపత్రి నుంచి తమకు లభించిన రాతపూర్వక కాపీ కూడా తన వద్ద ఉందని తెలిపారు.

తనిఖీల సమయంలో మిషన్ తీసుకొచ్చారు

ఈ విషయంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయగా, అధికారులు ఆసుపత్రిలో తనిఖీలు చేపట్టారని వంశీ బాలెంల తెలిపారు. అయితే తనిఖీల సమయంలో స్మిత్ అండ్ నెఫ్యూ కంపెనీకి చెందిన రోబోటిక్ మిషన్‌ను రాత్రికి రాత్రే ఆసుపత్రికి తీసుకొచ్చి చూపించారని ఆయన ఆరోపించారు. ఆ మిషన్ ఏ ఆసుపత్రికి చెందినదో అధికారులకు కూడా తెలుసని పేర్కొన్నారు.

ఈ వ్యవహారంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, మిషన్ అసలు ఎక్కడి నుంచి వచ్చింది? అది ఏ ఆసుపత్రికి చెందినది? ఫోర్టిస్‌లో దాని వినియోగానికి అనుమతులు ఉన్నాయా? వంటి అంశాలను స్పష్టంగా వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్లోబల్ హాస్పిటల్‌కు చెందిన మిషన్‌ను ఫోర్టిస్‌కు తీసుకురావచ్చా?

మరో ముఖ్యమైన అంశంగా వంశీ బాలెంల మాట్లాడుతూ.. ఎల్బీనగర్‌లోని గ్లోబల్ హాస్పిటల్ పరిధిలో స్ట్రైకర్ కంపెనీకి చెందిన రోబోటిక్ మిషన్ ఉందని పేర్కొన్నారు. ఆ మిషన్‌ను మరో ఆసుపత్రికి తరలించడం, తిరిగి ఇన్‌స్టాల్ చేయడం వంటి చర్యలకు సంబంధిత కంపెనీ అనుమతి, ప్రమేయం అవసరమని ఆయన ఆరోపించారు.

అటువంటి నిబంధనలు ఉన్నప్పుడు ఎల్బీనగర్‌లోని గ్లోబల్ హాస్పిటల్‌కు సంబంధించిన రోబోటిక్ మిషన్‌ను లకడీకాపూల్‌లోని ఫోర్టిస్ ఆసుపత్రికి తీసుకువచ్చి ఉపయోగించగలరా అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు.

"రోబోటిక్ మిషన్ గ్లోబల్ హాస్పిటల్‌లో ఉంటే, రోబోటిక్ సర్జరీ ప్రచారం కూడా గ్లోబల్ హాస్పిటల్ పేరుతోనే చేయాలి. లకడీకాపూల్ ఫోర్టిస్ ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీ సదుపాయం ఉన్నట్లు ఎందుకు ప్రచారం చేస్తున్నారు?" అని వంశీ బాలెంల ప్రశ్నించారు.

అలాగే ఎల్బీనగర్ పరిధిలో రోబోటిక్ మిషన్ ఉందని ఆసుపత్రి యాజమాన్యం స్వయంగా అంగీకరించినట్లు తమ వద్ద కాపీ ఉందని, లకడీకాపూల్ ఫోర్టిస్ ఆసుపత్రిలో రోబోటిక్ మెషిన్ లేదనే విషయంపై కూడా సంబంధిత పత్రాలు తమ వద్ద ఉన్నాయని ఆయన తెలిపారు.

"నాలుగు నెలలు ఉచిత రోబోటిక్ సర్జరీ" ప్రచారంపై అభ్యంతరం

రోబోటిక్ పరికరం అందుబాటులో లేకుండానే "నాలుగు నెలలు ఉచిత రోబోటిక్ సర్జరీ" అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ద్వారా ప్రజలను ఆకర్షించేందుకు ప్రయత్నించారని వంశీ బాలెంల ఆరోపించారు. ఇలాంటి ప్రచారాలు వైద్య నైతిక ప్రమాణాలకు, నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాన్ని అధికారులు పరిశీలించాలని కోరారు.

ఆసుపత్రిలో వాస్తవంగా ఏ రోబోటిక్ సర్జరీ పరికరం ఉంది? దాని యాజమాన్యం ఎవరిది? దాని ఇన్‌స్టాలేషన్, వినియోగానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? ప్రచారంలో పేర్కొన్న రోబోటిక్ సర్జరీలు వాస్తవంగా ఎక్కడ నిర్వహిస్తున్నారు? వంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయాలని డిమాండ్

ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే ఫోర్టిస్ ఆసుపత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత వైద్యుడిపై కూడా చట్టపరమైన చర్యలు చేపట్టాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌ను వంశీ బాలెంల డిమాండ్ చేశారు.

ఈ అంశంపై స్పందించి తనిఖీలు చేపట్టిన హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, తెలంగాణ ప్రభుత్వానికి దళిత విద్యార్థి సమైక్య తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి యాజమాన్యం నుంచి ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు వచ్చినా వెనక్కి తగ్గకుండా అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని, బాధితులకు న్యాయం చేయాలని వంశీ బాలెంల కోరారు.

## సిరిసిల్ల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సమన్వయ సమావేశం

**పోస్టర్ల ఆవిష్కరణ**
**ఈ నెల 26న రథోత్సవం**

**రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 7 (ప్రజాబలం ప్రతినిధి)**శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సమన్వయ సమావేశాన్ని సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు.2026 -2027 శ్రీ






లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవములు తేదీ 17-10-2026 నుంచి 27-10-2026 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల పోస్టర్లను అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులకు సూచనలు చేశారు.సమావేశంలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, ఆలయ ఈఓ వెంకట మారుతి రావు, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, వికాస తరంగణి సభ్యులు, సత్య సాయి సేవ సమితి సభ్యులు, దేవాలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల నుంచి రక్షణకు అప్రమత్తతే ఆయుధం

**ఫేక్ ఆఫర్లు, డిజిటల్ అరెస్ట్‌లను నమ్మొద్దు..**
**విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి**
**సైబర్ సురక్షిత సమాజ నిర్మాణంలో విద్యార్థులదే కీలక పాత్ర:**
**సైబర్ భద్రత పోస్టర్స్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డా. శబరీష్,**



మహబూబాబాద్ .సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటమే వాటి బారిన పడకుండా రక్షించుకునేందుకు ప్రధాన ఆయుధమని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, అన్నారు. కురవి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్య, బ్యాంకింగ్, షాపింగ్, కమ్యూనికేషన్ వంటి ప్రతి రంగంలో సాంకేతికత వినియోగం పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తత అవసరమన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, డిజిటల్ పేమెంట్స్, ఆన్‌లైన్ షాపింగ్ వంటి వాటిని ఉపయోగించే సమయంలో వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.

ఫేక్ ఆఫర్లు, బహుమతుల పేరుతో మోసాలకు గురికావద్దు

పండుగలు, ప్రత్యేక సందర్భాలను ఆసరాగా చేసుకుని తక్కువ ధరలు, భారీ డిస్కౌంట్లు, ఉచిత బహుమతులు, లక్కీ డ్రాలు అంటూ సైబర్ నేరగాళ్లు పంపే ఫేక్ లింకులు, మెసేజ్‌లను నమ్మవద్దన్నారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయడం, తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం ద్వారా వ్యక్తిగత, ఆర్థిక సమాచారం నేరగాళ్ల చేతికి వెళ్లే అవకాశం ఉందని హెచ్చరించారు.డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులకు భయపడొద్దుపోలీసులు, సీబీఐ, ఈడీ, కోర్టు అధికారులు అంటూ వీడియో కాల్స్ చేసి కేసుల పేరుతో బెదిరించడం, విచారణ పేరుతో గంటల తరబడి ఆన్‌లైన్‌లో ఉంచడం, డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడం వంటి డిజిటల్ అరెస్ట్ మోసాలు పూర్తిగా నకిలీవని ఎస్పీ స్పష్టం చేశారు. నిజమైన ప్రభుత్వ సంస్థలు వీడియో కాల్‌లో అరెస్ట్ చేసి డబ్బులు చెల్లించాలని ఆదేశించవని తెలిపారు. ఇలాంటి కాల్స్ వస్తే భయపడకుండా వెంటనే కాల్‌ను డిస్కనెక్ట్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఫేక్ ఐడీలు, సోషల్ మీడియా మోసాలపై జాగ్రత్త

సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలు పంచుకోవద్దని ఎస్పీ సూచించారు. ఇతరుల పేరుతో సృష్టించిన ఫేక్ సోషల్ మీడియా ఖాతాలు, ఫేక్ ప్రొఫైల్స్ ద్వారా మోసాలు జరిగే అవకాశం ఉందన్నారు. స్నేహితులు లేదా బంధువుల పేరుతో డబ్బులు అడిగే మెసేజ్‌లు వచ్చినప్పుడు, వారికి నేరుగా ఫోన్ చేసి నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలని తెలిపారు.విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కూడా సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, వృద్ధులు సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా పిల్లలు వారికి డిజిటల్ భద్రతపై వివరించాలని అన్నారు.

మోసానికి గురైతే వెంటనే 1930కు సమాచారం

ఆన్‌లైన్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు. వీలైనంత త్వరగా ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన మొత్తాన్ని నిలిపివేసే అవకాశం ఉంటుందని చెప్పారు. సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసులతో పాటు ప్రజలు, విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని కోరారు.

సైబర్ సురక్షిత సమాజ నిర్మాణంలో విద్యార్థులదే కీలక పాత్ర

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచి ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలని, సైబర్ నేరాలపై తమకు తెలిసిన సమాచారాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులతో పంచుకోవాలని ఎస్పీ సూచించారు. అప్రమత్తత, అవగాహన, బాధ్యతాయుతమైన డిజిటల్ వినియోగంతోనే సైబర్ సురక్షిత సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు.

# పత్రాలు లేకుండా పశువుల అక్రమ రవాణా కోట్లలో వ్యాపారం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 07** ఏటూరు నాగారం హిందువులు గోమాతగా పిలువబడే పశువులను గోశాలకు బదులు కళేబరాలు తరలిస్తున్న బడా వ్యాపారులు అధికారుల అండదండతో చేతులు మారుతున్న ధనం నెల నెలకు వాటా ములుగు జిల్లాలో చాల రోజుల నుంచి పశువుల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా జరుగుతున్న తరుణంలో గో వ్యాపారం వ్యాపారులకు మంచి పంటగా మొదలైంది దీనితో రాత్రి వేళలో ఎలాంటి రహదారులు లేకుండా చతిస్గడ్ మహారాష్ట్ర చర్ల ప్రాంతాల నుంచి అక్రమంగా కొనుగోలు చేసి ఎలాంటి రహదారులు లేకుండా చీకటి వ్యాపారాన్ని అధికారులు అండదండతో భయం లేకుండా వ్యాపారాన్ని కొంతమంది గుద్దదారులు నిర్వహిస్తున్నారు పలుమార్లు వాహనాలు దొరికిన ఎలాంటి పత్రాలు లేకుండా గో రవాణాను నిరూవరించిన గో వ్యాపారులు మాత్రం వారి పద్ధతులను మార్చుకోవడం లేదు పోలీస్ అధికారులు చెక్పోస్టుల వద్ద పోలీసు నిఘ ఏర్పాటు చేసిన వారికి తెలియకుండా దొంగ దారులలో మేడారం నుంచి భూపాలపల్లి భూపాల్ పల్లి టు హనుమకొండ హనుమకొండ టు హైదరాబాద్ చిన్నచిన్న వెహికల్స్ లో కాకుండా కంటైనర్లలో పెద్ద ఎత్తున గో వ్యాపారం జరుగుతున్న పట్టుకుని గోశాలలో తరలించిన గోశాల నిర్వాహకులు మరల వాటిని అక్రమార్కులకు అమ్ముతున్నారని అపోహలు వ్యాపిస్తున్నాయి వెంకటాపురం చెర్ల వాజేడు బీజాపూర్ రాష్ట్రాల నుంచి సరిహద్దులు దాటి కళేబరాల కు తరలి వెళు_న్న గోవులు ఇప్పటికైనా అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని గో వ్యాపారం చేసే వ్యాపారులను పట్టుకుని చట్టరీత్యా చర్యలు తీసుకొని గోవులను పరిరక్షించాలని వారిపై కేసును నమోదు చేయాలని కోరారు

# మేడారాన్ని సందర్శించిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్మెంట్ రాక

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 07 మేడారం** భోపాల్ బృందం మేడారం పర్యటనకు ఏర్పాట్లు చేసిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో మేడారం: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, అటవీ ఆధారిత జీవనోపాధి తదితర అంశాలపై క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్మెంట్ భోపాల్ కు చెందిన ప్రొఫెసర్ శరదిందు పాండే మరియు టీం మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ ఆదివాసీ మ్యూజియాన్ని సందర్శించారు.






ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచనల మేరకు బృందం మేడారం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయగా, మ్యూజియంలో గిరిజనుల సంప్రదాయ జీవన విధానం, సంస్కృతి, కళలు, ఆచారాలు, అటవీ ఆధారిత జీవనోపాధికి సంబంధించిన ప్రదర్శనలను బృందం పరిశీలించింది.

ఈ సందర్భంగా మ్యూజియంలో ప్రదర్శిస్తున్న గిరిజన సంప్రదాయ వస్తువులు, కళాకృతులు, ఆచారాలు, జీవన విధానానికి సంబంధించిన అంశాలను పరిశీలించి, తెలంగాణ గిరిజన ప్రాంతాల ప్రత్యేకతలు, సంస్కృతి పరిరక్షణకు చేపడుతున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు.

ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్మెంట్ బృందం పర్యటనలో భాగంగా గిరిజనుల అభివృద్ధి, అటవీ ఉత్పత్తుల సేకరణ, విలువ జోడింపు, ఎకోటూరిజం, గిరిజన సంస్కృతి పరిరక్షణ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తోంది. ఈ పర్యటన ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అనుభవాలను పరస్పరం పంచుకునే అవకాశం ఏర్పడింది.

# ఈవీఎం గోదాంలో భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు.

## నెలవారీ తనిఖీలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 07 ఆర్డీవో ఆఫీస్**బుధవారం జిల్లా కేంద్రం లోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారీగా తనిఖీ చేశారు.



ఈ సందర్భంగా ఈవీఎం గోదాం ప్రధాన ద్వారానికి ఏర్పాటు చేసిన సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, నిరంతర నిఘా వ్యవస్థ, విద్యుత్ సరఫరా, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే పరికరాలను తనిఖీ చేశారు.

అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే చేపట్టాల్సిన చర్యలు, అగ్నిప్రమాదాలు లేదా ఇతర భద్రతాపరమైన సమస్యలు ఎదురైన సందర్భంలో అనుసరించాల్సిన విధివిధానాలపై సంబంధిత సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. గోదాంలో భద్రతా ప్రమాణాలు నిర్దేశిత నిబంధనల మేరకు అమలయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం ఈవీఎం గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలు తదితర రికార్డులను పరిశీలించారు. గోదాంను సందర్శించే ప్రతి వ్యక్తి వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. భద్రతా సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఈవీఎంల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# బూర్గుపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 07 ములుగు**వెంకటాపూర్: వెంకటాపూర్ మండలంలోని బూర్గుపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించి పాఠశాలలోని విద్యా పరిస్థితులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.



ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించిన పీఓ విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయి, విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, తరగతి బోధనకు సంబంధించిన అంశాలను పరిశీలించి, విద్యార్థులు చదువుపై మరింత శ్రద్ధ చూపాలని సూచించారు.

అనంతరం పాఠశాలలోని డార్మిటరీని పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న వసతి సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులు, విద్యా సంబంధిత పుస్తకాలు, ఇతర నిర్వహణ అంశాలను కూడా పరిశీలించి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు సమర్థవంతంగా అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదల, క్రమశిక్షణ, హాజరు, ఆరోగ్యం మరియు వసతి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి.



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 7:** సత్తుపల్లిలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోకినేపల్లి వెంకటేశ్వర రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక నీలం రామచంద్రయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మార్క్సిస్టు సైద్ధాంతిక, రాజకీయ అవగాహనను పెంపొందించేందుకు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది ప్రతినిధులు తరగతులకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు సత్తుపల్లి మాధురి ఫంక్షన్ హాల్‌లో జరిగే శిక్షణ తరగతుల్లో పలు అంశాలపై బోధన ఉంటుందని తెలిపారు. 11న మార్క్సిస్టు తత్వశాస్త్రం, సాయంత్రం కులం--అంబేద్కరిజం, 12న ఉదయం సరుకు--శ్రమ--పెట్టుబడి, సాయంత్రం విప్లవ పార్టీ కార్యక్రమం, 13న ఉదయం జాతీయ--అంతర్జాతీయ పరిస్థితులు, సాయంత్రం నిర్మాణం--పని విధానం అంశాలపై తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. పోటు రంగారావు, ఎం.కృష్ణ, ఎస్.ఎల్. పద్మ, ఎం.హన్మేష్, కె.సూర్యం, కె.రమ తదితరులు శిక్షణ తరగతులను బోధించనున్నట్లు తెలిపారు. ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజంలో అసమానతలు, వైరుధ్యాలు, నిరుద్యోగం, పేదరికం పెరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. సామ్రాజ్యవాదం ప్రపంచ వనరులపై ఆధిపత్యం కోసం యుద్ధాలకు దారితీస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో విప్లవ పోరాటం ద్వారా సోషలిస్టు సమాజ నిర్మాణమే తమ పార్టీ లక్ష్యమని తెలిపారు. ఆ లక్ష్య సాధనలో భాగంగా కార్యకర్తల్లో రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ చైతన్యాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి సీ.వై. పుల్లయ్య, నాయకులు గోకినేపల్లి లలిత, గంట శ్రీనివాసరావు, బీరెల్లి లాజర్, అమర్లపూడి శరత్, ఒగ్గు నాగిరెడ్డి, తాటి రాజు, కోర్స వెంకటేష్, కె.పుల్లారావు, జె.మాల్యాద్రి, మంగయ్య, దేవి, అలివేలు, వెంకట నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదంలో గాయపడిన చిన్నారులను పరామర్శించిన BRS నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 07** ములుగుములుగు జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు పరామర్శ భాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేతములుగు జిల్లా కన్నా యిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్, నాగలక్ష్మి దంపతుల చిన్నారులు నిహస్వి(5), నిహాంత్ (2) ప్రమాదవశాత్తు చెత్తకుప్పల మంటలు తాకి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు, వారి సోదరులు శ్రీ కాకులమర్రి ప్రదీప్ రావు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను నేరుగా వెళ్లి పరామర్శించారు. బిఆస్పత్రి వైద్యులతో మాట్లాడి చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని, అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి, తమ వంతుగా తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, బి ఆర్ ఎస్ పార్టీ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కావిరి చిన్నికృష్ణ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పారా మెడికల్ సిబ్బంది నిరాహార దీక్ష.

తిరుపతి రుయా ఆసుపత్రి ప్రాంగణంలోని అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట పారా మెడికల్ సిబ్బంది బైటాయించి నిరహార దీక్షలు చేపట్టారు. నినాదాలు చేసారు. కాంట్రాక్టర్ గా పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలంటూ డిమాండ్ చేసారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు పారామెడికల్ సిబ్బంది నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు.. చోరీలపై అప్రమత్తంగా ఉండాలి.

## వేంసూరు ఎస్ఐ ప్రదీప్ సూచన.

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 7 :** సైబర్ నేరాలతో పాటు స్థానికంగా జరుగుతున్న చోరీల పట్ల ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని వేంసూరు ఎస్ఐ ప్రదీప్ సూచించారు. వేంసూరు మండల కేంద్రంలో స్థానిక ప్రజలు, వ్యాపారులతో సైబర్ నేరాలు, నేరాల నియంత్రణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ ప్రదీప్ మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు నమ్మి బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్కు సమాచారం అందించాలని సూచించారు.

ఇటీవల వేంసూరులోని ఓ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటనను ప్రస్తావించిన ఎస్ఐ.. వ్యాపారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి వ్యాపార సముదాయం, దుకాణం వద్ద నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి వేళల్లో షాపులకు పటిష్టమైన తాళాలు వేయాలని తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు, వ్యాపారులు సమన్వయంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటే సైబర్ నేరాలు, చోరీలను నియంత్రించవచ్చని ఎస్ఐ ప్రదీప్ పేర్కొన్నారు.

అవగాహన కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వ్యాపారులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# దసరాలోపు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

## -- కౌన్సిలర్ అప్పం శ్రవణ్‌కుమార్



**జహీరాబాద్, అక్టోబర్ 7 ప్రజా బలం ప్రతినిధి:** జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో పనిచేయని వీధి దీపాలను దసరా పండుగలోపు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బీజేపీ కౌన్సిలర్ అప్పం శ్రవణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలన్నారు. వీధి దీపాల కొనుగోలుకు కౌన్సిల్‌లో తీర్మానం చేసినప్పటికీ ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఇప్పటికే బతుకమ్మ, వినాయక చవితి పండుగలు పూర్తయ్యాయని, కనీసం దసరా నాటికైనా పట్టణాన్ని విద్యుత్ దీపాలతో వెలిగించాలని కోరారు. 36వ వార్డుతో పాటు ఇతర వార్డుల్లోనూ పనిచేయని దీపాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ కోరారు.

# సూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

## ప్రారంభించిన మంగాపురం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 7:** తల్లాడ మండల పరిధిలోని మంగాపురం పంచాయతీలో బుధవారం యుపిఎస్ స్కూల్ ప్రహరీ గోడ శంకుస్థాపన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ నరసింహారావు, ఉప సర్పంచ్ చింటూ పాల్గొని తమ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరిన వెంటనే సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ సభ్యురాలు శ్రీమతి మట్టా రాగమై దయానంద వెంటనే నిధులు శాంక్షన్ చేపించి స్కూల్ చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఆర్డర్లు జారీ చేసినందుకు మంగాపురం సర్పంచ్ ఉప సర్పంచ్ ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగాపురం సర్పంచ్ ఉప సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి స్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంగాన్న పేట సర్పంచ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి --

## తట్టు నారాయణ



**జహీరాబాద్, అక్టోబర్ 7 ప్రజా బలం ప్రతినిధి:** జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జహీరాబాద్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తట్టు నారాయణ డిమాండ్ చేశారు. వ్యవసాయానికి కీలకమైన సమయంలో లో-వోల్టేజ్‌తో పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యవసాయ మోటార్లు సక్రమంగా పనిచేయక పంటలకు అవసరమైన నీటిని అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. కనీసం ఆరు గంటలపాటు కూడా త్రీఫేజ్ విద్యుత్ సక్రమంగా సరఫరా కావడం లేదని ఆరోపించారు. మరోవైపు ఈ సీజన్‌లో సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో పంటల సాగు, ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు ఇప్పటికే ఆందోళనలో ఉండగా, విద్యుత్ సమస్యలు వారి ఇబ్బందులను మరింత పెంచుతున్నాయని తట్టు నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని కోరారు. లో-వోల్టేజ్ సమస్యను తక్షణమే పరిష్కరించి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. పంటలు దెబ్బతిని నష్టపోయే రైతులను ప్రభుత్వం గుర్తించి తగిన సహాయం అందించాలని, విద్యుత్, సాగునీరు, వర్షాభావ పరిస్థితులకు సంబంధించి అవసరమైన సహాయక చర్యలను వేగవంతం చేసి రైతులకు భరోసా కల్పించాలని తట్టు నారాయణ ప్రభుత్వాన్ని కోరారు.

# పత్రికల పెండింగ్ బకాయిలు చెల్లించాలి

**- సమాచార శాఖ కమిషనర్‌కు టీఎంఎస్‌పీజేఏ విజ్ఞప్తి**

**- సానుకూలంగా స్పందించిన కమిషనర్**



హైదరాబాద్: ప్రభుత్వ శాఖల నుంచి పత్రికలకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించి పత్రికలను ఆదుకోవాలని తెలంగాణ మీడియం, స్మాల్ డైలీ అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీఎంఎస్‌పీజేఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ జి. ముకుందరెడ్డిని కలిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపూరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పెండింగ్ బకాయిలకు సంబంధించిన బిల్లులను ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి పరిశీలనలో ఉన్నాయని, బకాయిలు త్వరలోనే చెల్లించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బాపూరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 400కు పైగా చిన్న, మధ్యతరహా దినపత్రికలు, వార, పక్ష, మాస పత్రికలు క్రమం తప్పకుండా ప్రచురితమవుతున్నాయని తెలిపారు. ఈ రంగంపై ఆధారపడి సుమారు ఐదువేల మంది పాత్రికేయులు పనిచేస్తున్నారని చెప్పారు. చిన్న పత్రికల మనుగడ, జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. చిన్న, మధ్యతరహా పత్రికల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రకటనల్లో చిన్న, మధ్యతరహా పత్రికలకు 30 శాతం వాటా కేటాయింపును అమలు చేయాలన్నారు. ప్రకటనల బిల్లుల సమర్పణకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేసి, బిల్లుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలన్నారు. పత్రికల ప్రచురణ క్రమబద్ధత పరిశీలనకు ఆన్‌లైన్ విధానం అమలు చేయాలన్నారు. పత్రికల ఎంపానల్‌మెంట్ ప్రక్రియను ఆరు నెలలకు ఒకసారి నిర్వహించి, పక్ష పత్రికలకు కూడా అవకాశం కల్పించాలన్నారు. ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రముఖుల పర్యటనల వార్తా కవరేజీలో చిన్న, మధ్యతరహా పత్రికలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. పత్రికల్లో పనిచేస్తున్న పాత్రికేయులందరికీ ప్రమాద బీమా కల్పించాలని కోరారు. మారుతున్న మీడియా పరిస్థితులకు అనుగుణంగా పాత్రికేయులకు శిక్షణ, పునశ్చరణ కోర్సులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా అకాడమీ పాలక మండలిలో టీఎంఎస్‌పీజేఏకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. చిన్న, మధ్యతరహా పత్రికలు, వాటిలో పనిచేస్తున్న పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని బాపూరావు కోరారు. సమస్యలపై అధికారులతో తక్షణ సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్ కంతేటి రమాదేవి, మిట్టపల్లి సురేందర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అశ్వత్థామ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

## -- యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి

జహీరాబాద్, అక్టోబర్ 7: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని యూత్ కాంగ్రెస్ జహీరాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్మికుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అభ్యర్థి అశ్వత్థామ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బుధవారం జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అశ్వత్థామ రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ప్రచారంలో సీనియర్ నాయకులు నర్సింహారెడ్డితో కలిసి నాగిరెడ్డి పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, నాయకులు గుండారెడ్డి, నరేష్, సోమప్ప, రమేష్, ప్రతాప్ రెడ్డి, మల్లికార్జున్, మల్లారెడ్డి, జగన్మోహన్, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# కరెంటు కోసం రైతన్నల కన్నెర్ర.. సబ్ స్టేషన్ల వద్ద ఆందోళన

హత్నూర, అక్టోబర్ 7 కరెంటు కోతలతో విసుగు చెందిన రైతన్నలు కన్నెర్ర చేశారు. రోడ్డు ఎక్కితే నైనా తమ సమస్య పరిష్కారం అవుతుందో ఏమోనని విద్యుత్ సబ్ స్టేషన్ల వద్దకు చేరుకొని ఆందోళన బాట పట్టారు. ఒకే మండలంలో రెండు ప్రాంతలల్లో సబ్ స్టేషన్ ల వద్ద ఆందోళన చేసిన రైతులు తమ గోడును వెళ్లబుచ్చు కుంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. పంటలు కళ్లముందు ఎండుతున్న ప్రభుత్వానికి పట్టదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే బుధవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన రైతులు వడ్డేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్, అదేవిధంగా తెల్ల రాళ్ల తండాకు చెందిన గిరిజన రైతులు సిరిపురం సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. పంటలకు ప్రభుత్వం ఇస్తున్న అరకొర విద్యుత్ వల్ల తమ చేతికి వచ్చిన వరి పంటలు ఎండుతున్నాయని, లో వోల్టేజీ సమస్యతో బోరు మోటర్లు కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కరెంటును లోవోల్టేజిగా ఇస్తుండటంతో బోరు మోటర్లు కాలిపోయి నష్టపోతున్నామని రైతులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రభుత్వం ఓవైపు వ్యవసాయానికి 12 గంటలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో కేవలం మూడు నాలుగు గంటలు మాత్రమే వస్తుందని రైతులు ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఏనాడు ఇంతటి దుస్థితి ఎదురు కాలేదని రైతులు ప్రభుత్వంపై మండిపడ్డారు. పంట సాగు చేసిన నాటినుండి రైతన్నలకు ఇబ్బందులు తప్పడం లేదని అన్ని రకాలుగా ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రెడ్డి ఫోన్లో విద్యుత్ శాఖ సీఎండీతో విద్యుత్ సమస్యపై మాట్లాడినట్లు రైతులు తెలిపారు. ఇకమీదట రైతులకు సరిపోను కరెంటు సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ ఏడిఈ శ్రీనివాస్, జిన్నారం సీఐ రమణారెడ్డి, ఏఈ రాఘవలు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# పోషక ఆహారం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

కౌతాళం పోషకాలతో కూడిన తాజా ఆకుకూరలు, కాయగూరలు ను ప్రతిరోజు తల్లి బిడ్డ తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అంగన్వాడీ టీచర్ కామాక్షి పేర్కొన్నారు. శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు నిర్వహించే అంగన్వాడి ఉత్సవ కార్యక్రమం భాగంగా బుధవారం కౌతళం మండల పరిధిలో మేలిగనూరు గ్రామంలో అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రధానోపాధ్యాయులు, గ్రామ పెద్దలు హాజరయ్యారు, వారు మాట్లాడుతూ అంగన్వాడీలు అందించే పోషక ఆహారం క్రమం తప్పకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ తీసుకోవాలని మరియు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నాపై మీరు చూపిస్తున్న ప్రేమాభినాలు ఎప్పటికీ మరువలేనివని మాజీమంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు

**సనత్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 7** నాపై మీరు చూపిస్తున్న, ప్రేమాభినాలు ఎప్పటికీ మరువలేనివని మాజీమంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన క్యాంప్ కార్యాలయంకు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ కాలనీల అసోసియేషన్





ల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్చాలు, పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి స్వీట్లు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం నాడే ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు ఉన్నప్పటికీ ఈరోజు నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కలిశారు. సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, వివిధ కాలనీల, అసోసియేషన్ ల ప్రతినిధులతో పాటు దిల్ సుఖ్ నగర్, కార్వాన్, కంటోన్మెంట్ తదితర నియోజకవర్గాల నుండి కూడా బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వచ్చి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టినరోజు వేడుకలను



వివిధ ప్రాంతాలలో పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించిన నాయకులు, అభిమానులను అభినందించారు. వేడుకల సందర్భంగా కేక్ కటింగ్, అన్నదానం, పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరాలను నిర్వహించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అమీర్ పేట లో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో రక్తదానం చేసిన వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపి సర్టిఫికెట్ లను అందజేశారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, టి. మహేశ్వరి, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు దాడి ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కొండాపురం మహేష్ యాదవ్, రాజేష్ ముదిరాజ్, కిషోర్, ఆంజనేయులు, కూతురు నర్సింహ, కట్టా బలరాం, కోటేశ్వర్ గౌడ్, లక్ష్మీపతి, శేఖర్, ఆరీఫ్, అఖిల్, ఉత్తమ్ సింగ్, గులాబ్ సింగ్, లలితా గోపిలాల్ చౌహన్, నోమాన్, హరిసింగ్, ప్రవీణ్, పీజీ రోడ్డు అసోసియేషన్ ప్రతినిధులు సంజయ్, రోచా, అమీర్ పేట సిక్కు సమాజ్ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## లయన్స్ క్లబ్,లయన్స్ కంటి హాస్పిటల్ వైరా అధ్వర్యంలో వైద్య శిబిరం

**విజన్ వీక్ సందర్భంగా మెగా ఉచిత కంటి వైద్య శిబిరం..**

**రుద్రాక్షపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం..**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 7:**సత్తుపల్లి మండల పరిధిలోని రుద్రాక్షపల్లి గ్రామంలో సత్తుపల్లి లైన్స్ క్లబ్,లయన్స్ ఐ హాస్పిటల్ , వైరా ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు.

వైద్య శిబిరాన్ని రుద్రాక్ష పల్లి సర్పంచ్ పి. నాగేంద్రబాబు మరియు గంధ్ర సోమిరెడ్డి కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి. రవిచంద్ర దాదాపు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 28 మందికి కంటి ఆపరేషన్స్ గుర్తించారు.

ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ ఛైర్పర్సన్ సోమిరెడ్డి మరియు రీజియన్ ప్రజెంట్ చైర్పర్సన్ మందపాటి చెన్నారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు లయన్స్ కంటి ఆసుపత్రి వైరా సహకారంతో సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ సత్తుపల్లి ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఎంతో మందికి చూపును అందించడం జరిగింది అని తెలిపారు. అలాగే లయన్ డాక్టర్ కాపా మురళి కృష్ణ ఐ హాస్పిటల్ నిర్వాకులు , లయన్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, డాక్టర్ రవిచంద్ర, కంటి ఆసుపత్రి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.





ఈ కార్యక్రమంలో

క్యాంపు చైర్మన్ లయన్ సత్యనారాయణరెడ్డి, క్యాంపు కో చైర్మన్ లయన్ పి.డి శ్రీనివాసరెడ్డి, కె. మురళి లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాణం పోయినా పోరాటం ఆపను

**-సినీ ఇండస్ట్రీ పెద్దలపై హీరో, మూవీ మేకర్ షిరాజ్ మెహదీ సంచలన కామెంట్స్**

**'సినీ ఇండస్ట్రీలో మాఫియా రాజ్యమేలుతోంది.. చిన్న సినిమాలను తొక్కేస్తున్నారు!'**

**'ఓ అందాల రాక్షసీ' హీరో షిరాజ్ మెహదీ సంచలన ఆరోపణలు**

**'థియేటర్లు ఇవ్వకుండా చిన్న నిర్మాతలను నాశనం చేస్తున్నారు'**

**'క్యూబ్, యూఎఫ్ఓ పేరుతో దోపిడీ జరుగుతోంది'**

**'బెదిరింపులు వచ్చినా వెనక్కి తగ్గను.. 100 ప్రెస్‌మీట్లు, ర్యాలీలకైనా సిద్ధం'**

**'త్వరలోనే 'ఓ అందాల రాక్షసీ'ని రీరిలీజ్ చేస్తా'**

**హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్:తెలుగు సినీ పరిశ్రమలో చిన్న సినిమాల పరిస్థితిపై హీరో, మూవీ మేకర్ షిరాజ్ మెహదీ సంచలన ఆరోపణలు చేశారు. ఇండస్ట్రీలో మాఫియా తరహా వ్యవస్థ నడుస్తోందని, చిన్న నిర్మాతలు, దర్శకులు అడుగడుగునా మోసం, దోపిడీ, వివక్షను ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. తాను నిర్మించి, హీరోగా నటించిన 'ఓ అందాల రాక్షసీ' చిత్రానికి థియేటర్లు కేటాయించడంలో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు బెదిరింపులు వస్తున్నాయని, అయినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని షిరాజ్ మెహదీ స్పష్టం చేశారు.



హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో షిరాజ్ మెహదీ మాట్లాడుతూ.. తన సినిమాను మంచి సాంకేతిక నిపుణులతో, ఎంతో కష్టపడి నిర్మించామని తెలిపారు. సరైన స్థాయిలో థియేటర్లు లభించి సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తే రికార్డులు సృష్టించే సత్తా తన చిత్రానికి ఉందని ధీమా వ్యక్తం చేశారు.

'చిన్న సినిమాలను తొక్కిపెడుతున్నారు'

సినిమా విడుదలకు థియేటర్లు దొరకడం చిన్న నిర్మాతలకు అతిపెద్ద సమస్యగా మారిందని షిరాజ్ మెహదీ ఆరోపించారు. పెద్ద సినిమాలకు ప్రాధాన్యత ఇస్తూ చిన్న చిత్రాలను పక్కన పెడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే 40కి పైగా ప్రెస్‌మీట్లు, 50కి పైగా ఇంటర్వ్యూలు ఇచ్చినట్లు తెలిపారు.

య"చిన్న సినిమాలను తొక్కిపెడితే చూస్తూ ఊరుకోం. మా హక్కుల కోసం ఎంతవరకైనా పోరాడతాం" అని ఆయన స్పష్టం చేశారు.'

'క్యూబ్, యూఎఫ్ఓ పేరుతో దోపిడీ'

డిజిటల్ ప్రొజెక్షన్, ఇతర విడుదల ప్రక్రియల పేరుతో చిన్న నిర్మాతలపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని షిరాజ్ ఆరోపించారు. క్యూబ్, యూఎఫ్ఓ వంటి డిజిటల్ ప్రొవైడర్లపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు.

వారానికి సుమారు రూ.2,000లో పూర్తయ్యే పనికి ఒక్కో థియేటర్ నుంచి రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానం వల్ల ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్న నిర్మాతలు మరింత నష్టపోతున్నారని అన్నారు.

ఫిల్మ్ ఛాంబర్‌పైనా తీవ్ర వ్యాఖ్యలు

చిన్న నిర్మాతలు, దర్శకులకు అండగా నిలవాల్సిన ఫిల్మ్ ఛాంబర్ తమ సమస్యలను పట్టించుకోవడం లేదని షిరాజ్ మెహదీ విమర్శించారు. చిన్న నిర్మాతల సమస్యలను పరిష్కరించాల్సిన వ్యవస్థే వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.

ఐనాక్స్, పీవీఆర్, ఏషియన్ ఫిల్మ్స్ వంటి ప్రముఖ మల్టీప్లెక్స్ సంస్థలు తొలుత థియేటర్లు ఇస్తామని చెప్పి, చివరి సమయంలో వెనక్కి తగ్గాయని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే చట్టపరమైన నోటీసులు ఇచ్చామని, హైకోర్టు నుంచి సమన్లు కూడా వెళ్లాయని తెలిపారు.

'సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోవాలి'

సినీ పరిశ్రమలో చిన్న సినిమాలు ఎదుర్కొంటున్న సమస్యలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని షిరాజ్ మెహదీ విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న డ్రైవర్లు, మేకప్ ఆర్టిస్టులు, టెక్నీషియన్లు, జూనియర్ ఆర్టిస్టులు తదితర కార్మికుల సంక్షేమం కోసం హెల్త్ ఇన్సూరెన్స్ వంటి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

'ప్రాణాలు పోయినా పోరాటం ఆపను!'

తనకు బెదిరింపులు వస్తున్నాయని వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని షిరాజ్ మెహదీ స్పష్టం చేశారు. "నా ప్రాణాలు పోయినా చిన్న సినిమాల హక్కుల కోసం నా పోరాటం ఆగదు. అవసరమైతే 100 ప్రెస్‌మీట్లు పెడతా.. ర్యాలీలు నిర్వహిస్తా. ఈ యుద్ధంలో చివరికి విజయం సాధించి తీరుతా" అని ఆయన ప్రకటించారు.

తన పోరాటం కేవలం 'ఓ అందాల రాక్షసీ' సినిమా కోసమే కాదని, చిన్న నిర్మాతలు, దర్శకులు, కళాకారులు, టెక్నీషియన్ల హక్కుల కోసం కూడా అని పేర్కొన్నారు.

'ఎలాగైనా సినిమా విడుదల చేస్తా'

ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గబోనని స్పష్టం చేసిన షిరాజ్ మెహదీ.. 'ఓ అందాల రాక్షసీ' చిత్రాన్ని త్వరలోనే రీరిలీజ్ చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తానని ప్రకటించారు.

చిన్న సినిమాలకు థియేటర్ల కేటాయింపు, డిజిటల్ ప్రొవైడర్ల ఛార్జీలు, ఫిల్మ్ ఛాంబర్ పాత్రపై షిరాజ్ మెహదీ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారాయి.

## రుద్రారం పాఠశాలలోఅంకిత స్వచ్ఛంద సంస్థ నుండి విద్యార్థులకు బ్యాగు మ్యాట్ స్లీపర్స్ పంపిణీ



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 7 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** ధరూర్ మండల్ రుద్రారం గ్రామం ప్రాథమిక పాఠశాలలో అంకిత స్వచ్ఛంద సంస్థ నుండి విద్యార్థులకు బ్యాంక్స్ స్లిప్పర్స్ మ్యాట్ పంపిణీ చేయడం జరిగిందని అంకిత ఫౌండేషన్ డిస్టిక్ ఇంచార్జ్ ఎం సురేష్, మండల కోఆర్డినేటర్ సంజీవరావు, తెలిపారుప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం కొనసాగించే విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారు ఉంటారు కాబట్టి వాళ్లు కూడా మంచి సత్ప్రవర్తనలో బ్యాగ్ స్లిప్పర్స్ మాట్స్ వేసుకొని క్రమశిక్షణగా కూర్చుని విద్యను అభ్యసించాలని మానసికంగా విద్యార్థులు ఎక్కడ కూడా నిరోత్సహంపడకూడదని అంకిత సంస్థ నుండి విద్యార్థులకు ఈ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు మెంబర్స్ గ్రామ సెక్రెటరీ ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పేరెంట్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు

### జనసేన పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జాబ్ మేళా

శ్రీకాళహస్తి, అక్టోబర్ 7 శ్రీకాళహస్తి పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని కార్యాల యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు బ్లూ స్టార్ ఏసీ కంపెనీలో భారీగా పెద్ద ఎత్తున జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ నాయకుడు, ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు తెలిపారు . ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థాన చైర్మన్, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టేసాయి ప్రసాద్ మాట్లాడుతూ నిరుద్యోగుల కోసం జాబ్ మేళా ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని, ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు ఇది మంచి అవకాశమని, శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రజలకు ఎప్పుడు జనసేన పార్టీ అందుబాటులో ఉంటుందని ప్రజల కష్టాలను సమస్యలను ఎప్పుడూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో తాము ముందుంటామని ఆయన తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com